నవశక్తి

Vol. 1, no. 3

(Dec. 29, 1937

రాజమండ్రి, 1937

Record no. 682

Navaśakti

Vol. 1, no. 3

(Dec. 29, 1937)

Rājamaṇḍri, 1937

Record no. 682

NAVASAKTI Telugu Weekly


అణా

నవశక్తి

కార్మిక కర్షకులారా! ఏకముగండు!!

సాలు చందా 3-0-0 | ప్రచురణ: ప్రతిబుధవారం | సంపాదకుడు: మద్దూరి అన్నపూర్ణయ్య

సంపుటం ౧ } రాజమండ్రి 29—12—37 { సంచిక ౩ 3



[రాజేంద్రబాబు కిసాన్ సంఘాల పైన వేసిన ఆంక్షను జూచి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు సంతసిస్తున్నారనీ, యునైటెడ్ ఫ్రంటు కిది భంగకరమంటూ సోషలిస్టులు కాంగ్రెస్ వారిని హెచ్చరిస్తున్నారు.

★ తూర్పు కృష్ణా కాంగ్రెస్ ★

ప్రజలకు విజ్ఞప్తి

కాంగ్రెస్ సామ్యవాదరైతు యువజన సంఘాల సభ్యులను తూర్పు కృష్ణాజిల్లాలో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘ ప్రతినిధులుగా రాకుండా చేయడానికి జిల్లాసంఘాధ్యక్ష ప్రధానకార్యదర్శులద్వారా పట్టాభి, బ్రహ్మయ్యగార్లు తీవ్ర ప్రయత్నాలు సాగించారు. ఏది ఏం కాంగ్రెసు సామ్యవాదులు ఆంధ్రరాష్ట్ర మహాసభాధ్యక్షపదవికి పోటీలో అన్నపూర్ణయగారికి ఓట్లిచ్చారో అప్పటినుంచి సామ్యవాదులపై పగపట్టారు. బ్రహ్మయ్యగారు అప్పటినుండి అనేక కృత్రిమ మార్గాలవలంబించి చెప్పరాని పనులు చేశారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికిగాను సామ్యవాదులపైన ఈజిల్లాలోను ఇతర జిల్లాలలోను అనేక నిందలు వేశారు. సామ్యవాద, యువజనరైతు సంఘాలవారు చల్లపల్లిపార్టీవారన్నారు. సత్యం, అహింస, ధర్మం అనేపదాలనే మరచిపోయారు. ఈవిధంగా దురభిప్రాయాలు వెదజల్లుతున్నప్పుడు రైతు యువజన సామ్యవాదులను సంబంధించినవారు జరిగిన సంగతులను ప్రజలయెదుట పెట్టకుండా వుండలేరు. క్రిందజరిగిన విషయములను పరిశీలించి ప్రజలు ధర్మాధర్మ నిర్ణయమొనర్తురుగాక!

బ్రహ్మయ్యగారి కోపానికి ఇంకొక కారణంకూడా కలదు. చల్లపల్లి రాజాగారితో పోటీచేసి బ్రహ్మయ్యగారు ఓడిపోయిన తరువాత రాజాగారి నభినందిస్తూ కృష్ణాపత్రికలో వ్రాసిన వ్యాసం బ్రహ్మయ్యగారిపై చాలామందికి కోపం కల్గించింది. ముఖ్యంగా ఆంధ్రయువకులు జస్టిస్‌పార్టీతరఫున నిలబడి గెలిచిన ఒకజమీందారును పొగడినందుకు బ్రహ్మయ్యగారినినిరసిస్తూ ఆంధ్రరాష్ట్ర యువజన మహాసభలో ఒకతీర్మానం ప్యాస్ చేసారు. దానిమీద బ్రహ్మయ్యగారు [illegible] కాంగ్రెసులో బాధ్యతగలస్థానములలో రానంటూ ఒకప్రకటనకూడా పత్రికలలో చేశారు. కాని దానినెంతకాలమో నిలుపుకొనలేకపోయినారు.

కాంగ్రెసు ఎన్నికలు జరిగినవెంటనే చంద్రశేఖరరావుగార్ని తొలగించుటకు ఆయన ఖద్దరుకట్టుటలేదనే నెపముతో వత్తిడి తీసుకొనివచ్చి శెక్రటరీపదవికి రాజీనామా పెట్టించిరి. తరువాత వల్లభనేని రామబ్రహ్మంగారిని పోటీలేకుండా శెక్రటరీగా ఎన్నుకొందామని బ్రహ్మయ్యగారు కొందరి సభ్యులతో చెప్పి ఎలక్షన్‌రోజున చెలసాని నాగభూషణంగారిని పోటీపెట్టారు. పోటీలేకుండా ఎన్నికజరుగునని ఉద్దేశ్యముతో సభ్యులెక్కువమంది (తీవ్రవాదులు) హాజరుగాకపోవడంవల్ల ఓట్లు ఉభయులకు సమానముగా వచ్చినవి. లాటరీకి రామబ్రహ్మంగారు వప్పుకొనకపోవడంవల్ల చలసాని నాగభూషణంగారు శెక్రటరీగా ప్రకటింపబడ్డారు.

యీ శెక్రటరీ నాగభూషణం, అధ్యక్షుడు నాగేశ్వరరావు మీర్జాపురం వర్గంలో తయారైన పెద్దమనుష్యులనే సంగతి మనజిల్లావాసులందరకు విదితమే. వీరి యిరువురుద్వారా జిల్లాకాంగ్రెసు పరిపాలించుటకు [illegible]య్యగారు.

[illegible] ప్రికాళం సాంబ [illegible] గింది. ఏపదవికి [illegible] ప్రధానకార్య [illegible] ష్ట్రకాంగ్రెస్ సభ్యుడుగా రావడానికి గోపాలరావుగారితో రాజీనామా పెట్టించారు. పోటీచేయడానికి యువకులు తయారయ్యారు. బ్రహ్మయ్యగారికి భయంపుట్టి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శితో చెప్పి నామినేషను తేదీగాని ఎన్నికతేదీగాని పత్రికలలోనైనా ప్రకటించకుండా ఎవరికి తెలియజేయకుండాచేసి నామినేషనొకటే రావడంచేత తానెన్నుకోబడ్డట్లును, అక్రమంగా ప్రకటింపజేసారు. ఈవిధంగా దొడ్డిదోవనుండా ప్రవేశించిన బ్రహ్మయ్యగారు ఆంధ్రరాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యాడు.

అందుపై జిల్లాకాంగ్రెస్ సభ్యులు జిల్లాప్రధాన కార్యదర్శిపై విశ్వాసరాహిత్య తీర్మానం పెట్టినారు. ఋణగ్రస్తులైన జిల్లాకాంగ్రెసు సభ్యులను ధనవంతుల ద్వారా ఋణదాతలద్వారా వత్తిడిచేయించారు. మీర్జాపూరుపార్టీ నాయకులను కార్లలో ఎక్కించుకొని సభ్యులకు సిఫార్సులు, వత్తిడి చూపించారు. తంజావూరు సభలో తమకన్నివిధాల సహాయం చేసినందుకుగాను మీర్జాపూరువర్గం జిల్లాకార్యదర్శి కనుకూలంగా విశ్వప్రయత్నాలు చేసారు.

జిల్లాకాంగ్రెస్‌సభలో పట్టాభిగారిచే మనజిల్లాలో తగాదాలుండడం క్షేమంకాదని, మన కప్రతిష్టయని, ధర్మోపన్యాస మిప్పించారు. పాపం సభ్యులు ఆమాటలకు మోసపోయారు. విశ్వాసరాహిత్య తీర్మానంఎత్తివేసుకొని ఆరోపణలు విచారించడానికి పట్టాభిగారిని నియమించారు. ఆరోపించిన నేరముల స్టేటుమెంటును ఆఫీసులో లేకుండాచేసి పట్టాభిగారి నాశ్రయించి తప్పు లేదనిపించారు.

పావలాసభ్యులను చేర్పించడానికి కాంగ్రెస్‌వాదులు ప్రచారం సాగించారు. బ్రహ్మయ్యగారు జిల్లా కాంగ్రెసు సంఘంవారు గూడుపుఠాణీచేసి రైతుయువజన సభ్యులకుగాని తమకు ప్రతికూలురుగానున్న కాంగ్రెసు వర్కర్లకుగాని పుస్తకాలివ్వడం మానివేసి భూషయ్య గ్రూపువారికి కాంగ్రెసుసభ్యుల పుస్తకములివ్వడం ప్రారంభించారు. గుడివాడతాలూకా కాంగ్రెసు సంఘంవారికి పుస్తకాలివ్వమని అచ్చువేయించగాదని జిల్లాకాంగ్రెసు అధ్యక్షునిద్వారా రెండులేఖలు వ్రాయించారు బ్రహ్మయ్య పట్టాభిగార్లు. పట్టాభిగారితో నిన్నుపడగొట్టడానికి రంగాను ప్రసిడెంటు చేయడానికి ప్రయత్నిస్తున్నారని పట్టాభిగారిని రంగంలోనికి దింపారు. పట్టాభి రంగంలోనికి తయారయ్యారు.

జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు పుస్తకాలివ్వమని వ్రాసినందున తాలూకా కాంగ్రెసు సంఘమువారు విధిలేక పుస్తకాలు అచ్చువేశారు. అచ్చువేయరాదని పట్టాభి బ్రహ్మయ్యగార్లు తమదేమో పోయినట్లు ఉత్తరాలు టెలిగ్రాములు పంపించారుగాని పుస్తకాలిప్పించలేదు. జిల్లాలో కొన్నివేలమంది పావలా సభ్యులు చేరారు. అందులో రైతుయువజన సభ్యులను బలపరచువారే ఎక్కువమంది వున్నారని తెల్సుకొని జిల్లాసంఘాధ్యక్ష కార్యదర్శులతో చెప్పి ఏ, యే, నియోజకవర్గాలలో తమవారు తక్కువనున్నారో అచ్చట 11—10—37 తేదీ నుండి జిల్లా కాంగ్రెసు ఆఫీసులో వట్టి లీష్టులు తెప్పించి తమవారధికంగా వుండునట్లు పోర్జరీలు చేయించారు, సభ్యుల సంతకాలు, నిశానీలు కల్పించారు. గ్రామాలలో మనుష్యులు లేకపోతే ఇతరగ్రామాలవారిని తమ గ్రామ సభ్యులుగా చేర్చారు. అంగలూరుగ్రామంలో సిరిసింతల ద్వారా చుట్టుపట్టు గ్రామాలవారిని రెండువందలమందిని బౌద్ధవాఙ్మయ బ్రహ్మగారు సృష్టించారు. గుడివాడ తాలూకా కాంగ్రెసుసంఘంవారి ద్వారా చేరిన 7077 సభ్యులలో 1266 సభ్యులనుతీసి. 10—10—37 తర్వాత చేర్పబడిరని ఒక ఉత్తరం జిల్లా కాంగ్రెసు కార్యదర్శితో వ్రాయించి తాలూకాసంఘంవారికి నోటీసుఇవ్వకుండా రాష్ట్రవర్కింగు కమిటీలో పెట్టి 1266 సభ్యులహక్కులను నిరాకరింపచేశారు. తమకు ప్రతికూలురుగానున్న జిల్లాకాంగ్రెసు సభ్యులయొక్క తాలూకా కాంగ్రెసు కార్యదర్శుల యొక్క ప్రాథమిక సభ్యత్వాలుకూడా రద్దుచేశారు. ఈవిధంగా నాలుగుఫిర్కాలలో తమకు మెజార్టీవచ్చునట్లు చేసుకొన్నారు. ఈకుతంత్రాన్ని జిల్లా కాంగ్రెసు సంఘం తాలూకా కాంగ్రెసుసంఘం నిర్భయంగా ఖండించింది.

తాలూకా కాంగ్రెసుసంఘంవారు అఖిలభారత కాంగ్రెసు సంఘంవారికి రిపోర్టుచేయగా రాష్ట్రకాంగ్రెసు సంఘానికి అపీలు చేయవలసినదిగా అ. భా. కాం. కార్యదర్శి ఆచార్య కృపాలేనీగారు ఉత్తరం వ్యక్తిగతమని చెప్పి రాష్ట్రకాంగ్రెసు సంఘసభలో పెట్టనన్నారు డా. పట్టాభిగారు.

యావద్భారత కాంగ్రెసు సంఘసభ్యులమతలవంపులు గలిగించునట్లు చేశారు. నియోజకవర్గాల నిర్ణయించడంలో తాలూకాలనుగాని ఫిర్కాలనుగాని గమనించలేదు. ఒక పద్ధతిగాలేదు. దూరాదూరాలు గమనించలేదు. ముదినేపల్లిగ్రామ ఓటర్లను రెండు ఖండములుగా చేర్చి రెండు నియోజకవర్గాలలో వేశారు. ఒక ఖండము బందరుతాలూకాలోను, ఒక ఖండము గుడివాడతాలూకాలోను వేశారు. నియోజకవర్గం 162 వుండాలనివుంటే 1500 వందలపై చిల్లరకు 1400 వంద పైచిల్లరకు ఒకనియోజకవర్గం వేశారు. అవనిగడ్డద ఓటర్లను రెండుముక్కలుచేశారు. దివితాలూకావారిని లలెండులోను, ఐలెండువారిని, దివితాలూకాలోను వేశారు. ఎక్కడెక్కడ తమకు ప్రతికూలమో అక్కడక్కడ బౌద్ధవాఙ్మయ బ్రహ్మగారు వాఙ్మయశక్తిని ప్రకటించి ఈకృత్రిమ ప్రహసనం ప్రదర్శించారు. ఈ ప్రహసనాన్ని విమర్శిస్తున్నవారిని వర్కింగుకమిటి మీటింగునకు రౌడీలను కాపలాపెట్టి తిట్టించారు. సభలలో అడ్జరన్‌మెంటులకు, రూలువుటులకు అంతులేదు. మినిట్ బుక్కుల ఫోర్జరీలకు అంతు లేదు. ఇక నామినేషన్లు 18 వ తేదీ 5 గం॥లోగా అన్నారు.

స్క్రూటినీ 19 తేదీ ఉదయం 9గం॥ల కని ప్రకటించారు. 5 గంటల తరువాత వచ్చిన బుల్లియ్యగారు వగైరా భూషయ్యగ్రూపువారి నామినేషన్లు తీసుకొన్నారు. స్క్రూటినీలో ఎల్లప్పుడు ఖాదీధరించుచు జైలుకు వెళ్ళివచ్చినవారినిసైతం ఖద్దరుకట్టడం లేదని మిష పెట్టి నామినేషన్లు నిరాకరించారు. తాలూకా కాంగ్రెసు కార్యవర్గసభ్యుడగు కె. బలరామయ్యగారు యొక్క నామినేషన్లు వేయేల తమకడ్డు వస్తారన్న వారందర్నీ మొత్తం 18 నామినేషన్లు నిరాకరించారు. కాంగ్రెసువారు లేకపోయినా వారి అనుయాయులకు కొన్నిస్థానాలు లభింపజేసారు.

ఇంతా కాంగ్రెసు పేరుపై బ్రహ్మయ్య పట్టాభిగార్లుచేస్తున్న టిలరాజనీతి తంత్రాలివి.

బ్రాహ్మణులవద్దకుపోయి పట్టాభిగారిని పడగొట్టుటకు చేస్తున్నారని, కాపులవద్దకు పోయి కమ్మగూడుపుఠాణీయని, మీర్జాపూరు గ్రూపువారివద్దకుపోయి చల్లపల్లి ముఠాయని దుర్మార్గ ప్రచారంకూడా సాగిం

(తరువాయి 15వ పేజీచూడుడు)

హిమాలయ పర్వతమంత పొరపాటు

★ కాంగ్రెస్ - కిసాన్ సంఘర్షణ ★

"ప్రజాందోళన, మనకు వ్యతిరేకముగా గాదు, మన కోసరమే"

కాంగ్రెస్ సోషలిష్టు పార్టీ నాయకుడు, జయప్రకాశ నారాయణగారి ప్రకటన.



"బీహారురాష్ట్ర కాంగ్రెసువర్కింగు కమిటీ తీర్మానము, కాంగ్రెసు చేసిన గొప్ప తప్పులలో ఒకటి. అనిర్ణయం అనేక చెడుగులకు మూలమవుతుంది. కాంగ్రెసులో అతి వాద ఉద్యమాన్ని యిచ్చగింపని, నేడు రాష్ట్రకాంగ్రెసు సంఘములో అధికసంఖ్యాకులుగా వున్నవారి చేతులను బలపరుస్తుంది. కాంగ్రెసుకు అండగావున్న రైతుసంఘాలలో పనిచేస్తూన్న కాంగ్రెసువాదులను పాల్గొన నివ్వకుండా చేసి కాంగ్రెసువాదులలో చీలికలు కలుగజేస్తుంది.

"బీహారు వర్కింగుకమిటీ తీర్మానము, దేశమందంతటా కాంగ్రెసు మితవాదులు నానాట వృద్ధిపొందుచున్న అతివాదులను అణచుటకు చేయుచున్న సంకల్పములో నొక భాగమని తోస్తూంది. ప్రజాందోళన ప్రజా పోరాటమునుండి, శాసనసభా కార్యక్రమం వేరు చేయ్యాలని మితవాదులు కోరుచున్నారు. అతివాదులు వారికి ఆటంకము: అందుచేతనే అహింసపేరుతో యీ సమారోహం.

"బీహారులో యీవిధానం దేనికి దారితీస్తుందో వూహించుట కష్టం. అయితే కిసాన్ సంఘము, అతివాదులు మాత్రం, సామ్రాజ్యవ్యతిరేక సమిష్టిసంఘటనావిధాన్నే అనుసరిస్తారు. నిషేధించినా కిసాన్ సంఘం కాంగ్రెసును బలపరచడానికే నిర్ణయించుకుంది. విభేదాలుకల్పించే మితవాదులయెత్తులు అపజయం పొందుతాయనీ, సమిష్టిసంఘటనా విధానం చివరకు జయం పొందుననీ నాగట్టినమ్మకం. విదేశాల్లో జరిగిన చరిత్ర ప్రసిద్ధమైన విషాదకరమైన అనుభవాలు మనకు దారిచూపాలి. ముఖ్యంగా చైనా దేశంలో జాతీయవాదులు కమ్యునిస్టుల పై కత్తిగట్టుట అందరికి విరోధులైన సామ్రాజ్యవాదులు బలపడటానికి సాయపడిందనే సంగతి మనకు గుణపాఠంగా ఉండాలి."

మోహన్‌లాల్, గౌతమా యం. యల్. ఏ. గారి ఖండన.

సంయుక్త రాష్ట్రకిసాన్ సంఘ కార్యదర్శి గౌతమా గారు కిసాన్ సంఘము పల్లెటూళ్ళలో కాంగ్రెసు ప్రతిష్టను న్యూనత పరుస్తూన్నదనే వాదనను ఖండించుతూ యిలాచెప్పారు.

"ప్రభుత్వంలో బాధ్యతగల స్థానాలందున్నవారు, సుప్రసిద్ధ కాంగ్రెసు వాదులచే నడుపబడుచున్న రైతు సంఘాలను గురించి బాధ్యతలేకుండా మాట్లాడుట విచారం, ప్రత్యేకంగా పన్నుల చెల్లింపరాదని రైతులకు బోధించుట మాపాలసీ కాదు, రైతులు పన్నులు చెల్లించకపోవుటకు బాధ్యతకిసాన్ సంఘప్రచారకులపై వేయుట భావ్యంకాదు. అది రైతుల అశక్యతపై ఆధారపడి వుంటుంది."

కాంగ్రెసులో చీలిక

అ. భా. కాం. సోషలిష్టు పార్టీ కార్యదర్శి ఎం. ఆర్. మసానీగారు పత్రికా ప్రతినిధితో ఇలాఅన్నారు.

"కాంగ్రెసునుండి సోషలిష్టులను బయటికి నెట్టివేయుటకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దాని చిహ్నమే బీహారు రాష్ట్రకాంగ్రెసు కార్యవర్గ కిసాన్ సంఘాలను గురించిన తీర్మానం, బాబూరాజేంద్ర ప్రసాద్ ఎంత సమర్థించినా యీ తీర్మానం కాంగ్రెసువాదులు కిసాన్ సంఘాలలోనూ పనిచేయుటకు ఆటంకంకలుగజేస్తూంది ఇది వరకే మూడు జిల్లాలలో రైతుసంఘ ప్రచారం కాంగ్రెస్ కమిటీలచే నిషేధింపబడింది. రాష్ట్రసంఘ తీర్మానం తక్కిన జిల్లాలను కూడా అదే పంథా అవలంభించడానికి ప్రోత్సాహమిస్తుంది. అఖిలభారత కాంగ్రెసు వర్కింగుకమిటీ కలిగించుకొనక పోయినచో, కాంగ్రెసులోనూ, రైతుసంఘాలలోనూ పనిచేస్తూన్న సోషలిస్టులకు యిది తీవ్ర సమస్యయే అగును.

అతివాదులపై యీ దాడి కాంగ్రెసు మంత్రివర్గాల ప్రోత్సాహంతో జరుగుతూందని నానమ్మిక. వారి యిష్టమొచ్చినటుల మెలంగే కాంగ్రెసు కమిటీ వుండాలని కోరే వీరు, ప్రజాందోళనకు ప్రాధాన్యత నిచ్చేవారిని క్రాంగ్రెసులో నుండి వెడలగొట్టతలుస్తున్నారు."

అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు—శివనాథ బెనర్జీ విజ్ఞప్తి.

ఢిల్లీలో జనవరి 1, 2, 3వ తేదీలలో జరగనున్న ట్రేడ్‌యూనియను కాంగ్రెసుకు, ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్, అ. భా. కిసాన్‌సభ, అ. భా. కాం. సోషలిష్టుపార్టీ మొదలగువాటికి ఆహ్వానంపంపారు. శివనాథ బెనర్జీగారు ఆహ్వానంలో ఇలావిజ్ఞప్తి గావించారు.

"కాంగ్రెసు మంత్రివర్గంకూడా, తదితర మంత్రులలాగానే, అతివాద సంస్థలపైన, పార్టీలపైన 124 సెక్షన్ ప్రయోగించుట, నిరాయుధులగు కార్మికులపై తుపాకుల కాల్చుట మొదలగు పనులు కావించారు.

దానికి మనం ఐక్యకంఠంతో అసమ్మతి చూపాలి. బీహారు కాంగ్రెసుకమిటీ బీహారు రైతుసభను బహిష్కరించుట, కాంగ్రెసు అతివాదపక్షం వారియెడ మంత్రిపక్షం వారికి గల ప్రాతికూలానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం, దీనిని ఎలా ఎదుర్కొనాలో అతివాదపక్షలన్నీ కలిసి ఆలోచించాలి."

కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించండి.

బొంబాయి ప్రముఖుల విన్నపం

ఎన్. సి. కేల్కార్, యస్. ఏ. బ్రెల్వీ, కే. ఎఫ్ నారిమన్, ఎన్. ఎం. జోషీ, బఖ్లే, మసానీ, మెహరాలీ, ఉమాశంకర దీక్షిత్, అబీదాలీ, జాఫర్‌ఖాను, మొదలగు వారు యీ క్రింది ప్రకటన గావించారు.

"తక్కిన అన్నిరాజకీయ పార్టీలకు వలెనే కమ్యూనిస్టులకు తమభావాలను ప్రకటించడానికి ప్రచారంచేయడానికి స్వాతంత్ర్యముండాలి. ప్రజాస్వామిక దేశాలైన అమెరికా ఫ్రాన్సు యింగ్లాండులలో కమ్యూనిష్టుపార్టీ కట్టి స్వాతంత్రం వుంది. కమ్యూనిజాన్ని అంగీకరించినాలేకపోయినా భావస్వాతంత్రాన్ని అంగీకరించే వారంతానాగరికదేశాల్లో కమ్యూనిష్టుపార్టీ నిర్మాణానికి అవకాశమివ్వడానికి ప్రచారానికి అంగీకరిస్తున్నారు. అలహాబాద్ హైకోర్టు మీరట్ కేసు తీర్పులో కమ్యూనిష్టు భావాలుగలిగి వుండుట నేరంగాదని తెలిపారు. ఎట్టి రాజకీయాభిప్రాయము లైనను కలిగి వుంటానికి, యితరులను తన పంథాలోనికి మార్చుకోడానికి వ్యక్తికి హక్కుండాలి. కాబట్టి భారతదేశంలోకూడ కమ్యూనిష్టులకు తక్కిన ప్రజాస్వామిక దేశాల్లోవలె రాజకీయపార్టీగా వుండుటకు హక్కులు కలిగివుండాలి. వివిధరాష్ట్రాలలోని మంత్రివర్గాలు తమరాష్ట్రాలలోని కమ్యూనిష్టులు పార్టీశాఖలపై నిషేధం తొలగించాలి. భారతప్రభుత్వాన్ని నిషేధం తొలగించాలని కోరుచూ తీర్మానాలు శాసన సభల్లో ప్యాసు చేసిపంపవలెను." పైగా కమ్యూనిష్టులు ఎన్నడును దౌర్జన్యం ప్రోత్సహించి యుండలేదని కూడా తెలిపారు.

చైనాదినము

పీడితులకు సహాయం చేయండి!

"చీనాదాడి సందర్భమున జపానువారు సలుపుచున్న దురంతములను వివరించుచు, విరాళములను ప్రోగుచేసి చీనాసోదరులకు వైద్యసహాయము గావింపవలయునని కోరుచు నేను ఇటీవల ఒక ప్రకటన గావించి యుంటిని. చీనాప్రజలకు సహాయ పడవలయునని చీనా సేనాని చూటె గారుపంపిన లేఖ నాకు నేడందినది. వీరు కొన్ని సంత్సరములక్రితము తన సేనలను 8000 మైళ్ల దూరము నడిపించి గొప్పప్రఖ్యాతి గాంచిన గొప్పసేనాని యని భారతీయులు గమనింపవలెను.

1938 సంవత్సరము జనవరి 9వ తేదీని చీనా దినముగ పరిగణించి ఆ నాడు భారతదేశమునందంతయు సభలుజరిపి, చీనా ప్రజలకు వైద్యసహాయము పంపుటకై విరాళములను ప్రోగుచేయ వలయునని సూచించుచున్నాను. ఇట్టివిరాళములను అలహాబాదు స్వరాజ్యభవనమునందలి అఖిలభారత కాంగ్రెసుసంఘపువిదేశాంగశాఖకు పంపవలయును."

— జవహర్‌లాల్ నెహ్రూ

★ ఆదర్శం ★

★ కామ్రేడ్ జె. రామ లింగయ్య. ★

ఆదివారం సాయంకాలం. గది ఎంతో నీటుగా అమర్చబడింది. మధ్యలో ఒక టేబిల్, దానిచుట్టూ మూడు కుర్చీలు. టేబిల్‌పైని తెల్లటి గుడ్డ. అల మారులోనుండి బిగ్-బెన్ టిక్ టిక్ అంటూంది. మాటిమాటికి ఇందు గడియారంవైపు చూస్తూంది. వెంటనే గుమ్మంవద్దకు రావటం బజారువైపుచూడటం మరల గడియారం చూసింది. 3—55 అయింది. "అబ్బా" అంటూ ఇందు కుర్చీలో చతికిలపడింది. ఏమీ తోచటంలా. మరల లేచింది. టేబిల్‌పై గుడ్డ అటూ ఇటూ సర్దింది. కుర్చీలు వెనక్కీ ముందుకీ లాగింది. అద్దానికి ఎదురుగా నిలబడి జుట్టు సవరించింది. ఏదో విధంగా నాల్గు నిమిషాలు గడచాయి. గుమ్మం వద్దకు వెళ్ళిందోలేదో, ఒకచేతితో పుస్తకాల కట్ట, మరి యొకచేత్తో సైకిలు పట్టుకొని మెట్లు యెక్కుతూ సాగర్ "గుడ్ ఈవినింగ్, ఇందూ" అంటూ చిరునవ్వు నవ్వాడు. చెమటతో చొక్కా తడిసి ముద్దయింది.

ఇందు:- "గుడ్ ఈవినింగ్, సాగర్"ఎండ చాలా ఎక్కువగా వుంది. పరీక్షలు నిన్ననేగా అయింది. బాగా నిద్రతీసి వస్తారేమో. చాలా ఆలస్యంగావచ్చు అని అనుకుంటున్నా.

సాగర్:-ఇండియన్ పంక్చుయాలిటీ అనుకున్నావు కాబోలు. సరేగాని మధు ఏడీ?

ఇందు:-తమలపాకు బీడాకోసం వెళ్ళాడు. అయిదు నిమిషాల్లో వచ్చేస్తాడు.

సాగర్:-ఏమిటీ అట్టహాసం. అల్లుడిని సాగనంపుతూ వున్నట్లుంది.

ఇందు:-కాగూడదా? మరి ఎప్పుడు వస్తారో ఏమో, చదువు సాంతమయింది. మావూరు ఇక ఎవరి కొరకు వస్తారు?

సాగర్:-స్నేహితుల కొరకు.

ఇంతలో తమలపాకు బీడాలు సోడాలతో సహా మధు ప్రవేశించాడు.

మధు:-అంతా సిద్ధమేనా ఇందూ?

ఇందు:-"యస్" అంటూ రక రకాల పింగాణీ పళ్ళాలు, కప్పులు తెచ్చి చకచక టేబిల్ నింపేసింది. ముగ్గురు మూడుకుర్చీల్లో చతికిలబడ్డారు. ఒక ప్లేటులో రెండు లడ్లూ మరియొక దానితో బజ్జీలు సాగర్ ముందు వుంచబడ్డాయి.

సాగర్:- ఇందూ ఎక్స్క్యూజ్ మి. ఒక లడ్డు తీయాలె. బజ్జీలు గూడా సగం తగ్గించాలె. రాత్రికి రైల్లో నిద్రవుండదు. నిన్నరాత్రి స్నేహితులతో కబుర్లతో పొద్దుపోయింది. వంట్లో బాగాలేదు. పూరకే పొట్టను లోడ్ చేయగూడదు.

ఇందు:-ఒకలడ్డుకే జబ్బుచేస్తుందా? ఏమీ పరవా లేదు. ఉంచుదురూ.

సాగర్:-ప్లీజ్, ఎక్స్క్యూజ్ మి. నేను ఎప్పుడూ నిగ్గు పడేవాడిని కాదు. నా స్వభావం నీకు బాగా తెలుసుగా.

ఆ: తెలియకేం, అంటూ ఇందు చిరునవ్వు నవ్వింది. పోనీ ఈ రాత్రికి మా ఇంట్లో వుండరాదా రెస్టు తీసుకొని రేపు పోవచ్చు.

సాగర్:-కాదు. వెంటనే వెళ్ళాలె. వివాహం ఒక టుంది. మా నాయనగారు వెంటనే రమ్మనివ్రాసారు.

వివాహం అనేమాట వినటంతోనే ఒక్కమాదిరిగా ఇందు వళ్ళు ఝల్లుమంది. మొఖంలో మార్పు సాగర్ వెంటనే గమనించాడు.

ఇందు:-(తడబడుతూ) ఎవరి వివాహం.

సాగర్:-మా చెల్లెలి వివాహం. నావివాహంకూడా కలిపి చేయాలని మా నాన్నగారు మొదట అనుకున్నారు. కాని నేను ఏదో సాకు చెప్పి ప్రస్తుతం ఆపివేయించా.

ఇందు కంఠస్వరం కొంచెం కుదుటబడింది. తిరిగి ముఖం తేజోవంత మయింది. కాని ఆమెలో ఆవేదన, ఆతురత స్పష్టంగా పైకి కనబడుతూనే యున్నయి. టిఫిన్ తీసుకుంటూ వున్నట్లుగా పైకి నటిస్తూవుంది. మధు సక్రమంగా తనవ్యవహారం తాను కానిస్తున్నాడు. సాగర్ కొంచెంగా లడ్డు విరుస్తూ శాస్త్రోక్తంగా నిముషానికి 60 మారులు నములుతూ భోజనంలో గూడా సెల్ఫ్ డిసిప్లిన్ చూపిస్తున్నాడు.

మధు:-పోనీ కాఫీ అయినా త్రాగుతాడేమో! ఇందూ, కాఫీ కలుపు.

సాగర్:- తొందరలేదు. మధు నీవు కానీయి.

ఇందు కాఫీ కలిపి సాగర్ ముందు పెట్టింది. వంచ దారలో చీమలు కాబోలు రెండు మూడు కాఫీకప్పులో పైకి తేలుతున్నాయి. సాగర్ తల వంచుకొని నెమ్మదిగా స్పూన్‌తో చీమలు తీసివేయటానికి ప్రయత్నిస్తున్నాడు. సమయం కనిపెట్టి యిందు అన్నవైపు చూచింది. మధుకు విషయం బోధపడింది.

మధు:-సరేకాని, సాగర్ నీ వివాహం ఎందుకు ప్రస్తుతం ఆపు చేయించావు. ఖర్చులో ఖర్చు కలిసి వచ్చేదిగా.

సాగర్..ఇప్పుడే వివాహం నాకు ఇష్టం లేదు.

మధు:-అయితే, ఇంకా చదివిన మీదట చేసుకుంటావన్న మాట.

సాగర్:-లేదు. ఇక చదువూలేదు. గిదువూలేదు. ఇంతటితో ఈ కాలేజీకి, ఈ లెక్చరర్సుకి ఒక్కనలాం, ఏదో విధంగా బి. ఏ. అనర్సు అనిపించుకుంటా. ఇదే చాలు.

మధు:- మంచిది. నెక్స్టు ప్రోగ్రాం ఏమి నిర్ణయించావు.

సాగర్ ఎందుకో సంకోచిస్తున్నాడు.

మధు:-(చిరునవ్వుతో)వివాహం చేసుకోక చదువుకోక ఏమి చేస్తావ్.

సాగర్:-(గంభీరంగా) ఏమి చేయాలె? పెండ్లి మాత్రం ఇప్పుడు ఇష్టంలేదు.

మధు:-సరేలే! ఇక తెలిసింది. ఇక దాచిన లాభం లేదు. ప్రియమిత్రుని ముందుగూడా ఇంతరహస్యమా. ఎవరినైనా ప్రేమిస్తున్నావా ఏమి?

ఇందు ముఖం పలువిధాలుగా మారిపోతూ వుంది.

సాగర్:-(ఇంకా గంభీరంగా) ఆ! ప్రేమించా

ఇందుగుండె దడకొట్టింది. సిగ్గుతో ఒకవైపు ఆమె కంపించి పోయింది. తలయెత్తి సాగర్‌వైపు చూడటానికి విశ్వప్రయత్నం చేసింది. ఇక ఎకచకాలు పనికిరావనుకొన్నాడు. మధు తాను మధ్యవర్తిత్వం వహించాడు. ప్రేమ సంబంధమగు వ్యవహారంలో, తానుకూడా ఒక పెద్దమనిషిగా ప్రవర్తించాలె.

మధు:-డియర్ సాగర్, నిజంగా అడుగుతున్నా. నీవు ఎవరిని ప్రేమించావ్.

సాగ:-(అత్యంతగంభీరంగా) ఎవరినా. నా ఆదర్శాన్ని ప్రేమించా. పీడితులగు కార్మిక కర్షకులను ప్రేమించా. నా జానిసదేశాన్ని నే ప్రేమించా. నా హృదయపూర్వకంగా ప్రేమించా. ధనముకంటె, అధికారముకంటె, నా శరీరముకంటె నా తలిదండ్రులకంటె, సర్వసుఖములకంటె.

ఇందు, మధు చకితులై చూస్తున్నారు. ఇందు కళ్ళనుండి బొట్లు జలజల రాలుతున్నాయి.

ఇందు:- వుద్రేకంతో, ఒక్కసారిగా, సాగరు చేయి లంకించుకొని "మై డియరు సాగర్" అని ఎంతో కష్టంగాఅంది. అంతే ఇకనోట మాటరాలేదు. సాగర్ ఇందువైపు చూచాడు. చూపులో చూపు కలిసిపోయింది. బాష్పములకు బాష్పములే జవాబను కున్నాడు. మధుకూడా వారిలో భాగస్థుడయ్యాడు. ముగ్గురి కన్నీరుకలిసి సాగరమయింది. చిట్టచివరకు గుండె నిబ్బరము చేసుకొని, చేయి తప్పించుకొని సాగర్ గంభీరంగా నిల్చబడ్డాడు. "డియర్ ఇందూ ఎక్స్క్యూజ్ మి. ఇదిగో నీకు నా ప్రేమ చిహ్నము" తాను తెచ్చిన పుస్తకాలకట్ట బల్లమీదపెట్టాడు. హడావుడిగా సైకిలు తీసుకొని గుడ్‌బై చెపుతూ గబగబా వీధిమెట్లు సాగరు దిగాడు. అదేవిధంగా కదలక మెదలక కొయ్యబొమ్మల్లాగా ఇందు మధు చూస్తున్నారు. తిరిగి గుడ్‌బై కూడా చెప్పలా. 10 నిముషాలుగడచాయి. ఇందు పుస్తకాల కట్టవిప్పింది. ఈ క్రిందిగ్రంథాలు కనపడ్డాయి. గోర్కీగారి అమ్మ, లెనిన్ జీవితము, కమ్యూనిస్టు కరపత్రం, రష్యా విప్లవచరిత్ర. ప్రతి పుస్తకంపైన చెక్కబడినట్లుగా ముత్యాలవంటి అక్షరాలతో "ప్రెజంటెడ్,

టు మై డియర్ సిస్టర్ ఇందు,
విత్ ది బెస్ట్ లౌ
సాగర్."

అని వ్రాయబడింది.

విప్లవం మనం నిత్యం చూచే అనేక సంఘటనాల్లో వుంది. ఇది భయపడ వలసినంతటి పైశాచిక కృత్యం మాత్రం కాదు. గుడ్డును బ్రద్దలుగొట్టి కోడిపిల్ల కొత్త జీవనంలోకి; అంకురాన్ని పెగల్చుకొని మొక్క నూతన జీవంలోకి వస్తున్నాయి. విప్లవం నవచైతన్యం యొక్క ఆరంభం— విప్లవంలోనే జీవితాభివృద్ధి వుంది— విప్లవం వద్దని కళ్ళు మూసు క్కూచోడం, చచ్చు జీవితాన్ని వాంఛించడం అన్నమాట. సమాజం యొక్క నవ జీవనానికీ, తేజస్సుకీ— విప్లవం కావాలి! రావాలి!!

★ విప్లవం పరిణామం

యం. వి. వీరయ్య

సంఘ సంస్కరణం యెప్పుడూ కూడా పాలక వర్గం యొక్క శ్రేయస్సుకే అనుగుణ్యంగా ఉంటుంది. సమాజం మీద పాలక వర్గాని కుండే అధికారాన్ని యిది యేమాత్రం అడ్డుపెట్టదు. సరికదా, ఆ అధికారాన్ని యిది ఒక్కొకప్పుడు బలపరుస్తూ ఉంటుంది కూడాను. సమాజ విప్లవానికీ, పాలక వర్గానికీ, యేకోశాన్నీ పొత్తు కుదురదు. ఎప్పుడూ సమాజ విప్లవం నిరంకుశ పాలనా విధానాన్ని మచ్చుకు కూడా లేకుండా నాశనం చేస్తుంది. విప్లవం తమ అధికారాన్నీ, అవకాశాల్నీ యెక్కడ ఊడబెరుకుతుందేమో అనే భయం చేత, దీన్ని గురించి దుష్ప్రచారం చేస్తూ విప్లవాన్ని లేవకుండా అణచివేస్తూ ఉంటారు పాలక వర్గం. సమాజ విప్లవాన్నీ, సంఘ సంస్కరణాన్ని సరిపోలుస్తూ, సంస్కరణాన్ని కొండంత చేసి పొగుడ్తూ ఉంటుంది యీ వర్గం. సంస్కార ఉద్యమాన్నైనా, ఊరికే పొగుడ్తారు గాని, నిజానికి దీన్ని కూడా సాగించనీరు వీళ్ళు. "విప్లవం వద్దు మొర్రో" అని గింజుకొనే వాళ్ళ తర్కం అంతా. యిప్పుడు సమాజాన్ని పీడిస్తూ అధికారం చేసే భావాలు నుంచి జనించిందే. మత పిశాచం మానవ హృదయాల్లో రాజ్యం చేస్తున్నంత కాలం, ఒక వర్గం సమాజాన్ని పీడిస్తూ పరిపాలించటం, యీశ్వర దత్తమైన హక్కు అంటూ తృప్తి పడి ఊరుకుంటుంది జనసామాన్యం. "నా విష్ణుః పృథ్వీపతి" అని పవిత్రంగా ఉచ్చరించుకుంటూ, రాజే యీశ్వరుని ప్రతినిధి అంటూ, ఆతడేం చేసినా 'బళాబళి' అంటూ, ఆ నిరంకుశపాలనా విధానాన్నీ, పాలకవర్గంయొక్క అన్యాయపు హక్కుల్నీ భక్తితో, తృప్తితో, కాపాడుతూ ఉంటుంది జన సామాన్యం మత పిచ్చిచేత. లేని మతావేశాన్ని తెచ్చిపెట్టుకొంటూ 'విప్లవం దౌర్జన్యం' అని గొంతుకు బొంగురు పొయ్యేదాకా చించుకొంటుంది పాలక వర్గం. సమాజం మీద వాళ్ళకుండే అన్యాయపు హక్కుల్నీ, అధికారాన్నీ, కాపాడు కోటానికి, నేటి సమాజ విధానం, న్యాయసమ్మత మయిందే అని మొండి వాదన చేస్తారు వీళ్ళు. నిజానికి ఈహక్కుల్ని నేటి సమాజాన్ని పాలిస్తూన్న వర్గం, విప్లవం ద్వారానే సంపాదించింది. విప్లవ చైతన్యంతో ఉడికి పోతూన్న నేటి స్వాతంత్ర్య వీరుడు యీ కృత్రిమ సమాజాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూ, జనసామాన్యం వాళ్ళ సహజ హక్కుల్ని పొందటానికి, ఆ విప్లవమే ఆయుధమంటాడు. మాయ మాటలకీ, మతావేశానికీ, లొంగిపోకుండా, నేటి కృత్రిమ సమాజ విధానాన్ని కూలదీయటానికి, యేమాత్రం జంకూ గొంకూ లేకుండా, ముందడుగు వేస్తున్నాడు విప్లవవాది.

సమాజాన్ని పాలిస్తూన్న ఉన్నతవర్గం, విప్లవాన్ని అణచి పెట్టడానికి, పరిణామవాదాన్ని (Evolution) యెత్తి చూపుతున్నారు. పరిణామవాద సహాయంతో, నేటి సమాజ విధానాన్ని, వాళ్ళహక్కుల్ని కాపాడు కోటానికి తంటాలు పడుతున్నారు. అల్లా అవటంలో శాస్త్రజ్ఞులు ఒక వర్గంయొక్క సమాజ రాజకీయ ఆశయాల్ని మనస్సులో పెట్టుకొని సిద్ధాంతాలు చేస్తున్నారని కాదు. కాని సాధారణంగా తనకి తెలియకుండానే తానే వర్గంలో ఉంటాడో, ఆ వర్గం యొక్క స్వభావాల్ని కొంచెంగా తన శాస్త్రీయ సిద్ధాంతాల్లో ప్రవేశపెడతాడు శాస్త్రజ్ఞుడు. విప్లవాన్ని తీవ్రంగా నిరోధించే 'మాల్థస్' యొక్క ప్రభావం, 'డార్విన్' మహాశయుని యొక్క శాస్త్ర పరిశోధనల్లో మనకి స్పష్టంగా కనపడుతుంది. 'డార్విన్' యొక్క పరిణామ వాదం ఇంగ్లండులోని పాలిత వర్గంచేత అనేక సార్లు అణచివేయ బడ్డా, యిది 250 సంవత్సరాలు, తీవ్రంగా, బ్రిటిషు ఛాందసుల తోటి విప్లవపోరాటాన్ని సలిపింది. యీ నూతన పరిణామ వాద సిద్ధాంతాన్ని, తమ తమ వాదాల్ని బలపరుచు కోటానికి ప్రజా సామాన్యంలో కొన్ని వర్గాలు తమదానిగా చేసుకొని ఉపయోగించు కొంటున్నాయి. యీ పరిణామ వాదం వోవిధంగా విప్లవ వాదుల్ని కూడా బలపరచింది. ఎల్లాగంటే ప్రజా సమూహంలో, తరతరాలనుంచీ పాతుకు పోయిన, అలౌకిక క్రియల యందుండే మూఢ విశ్వాసాల్నీ, పిచ్చి పిచ్చి నమ్మకాల్నీ దుంపనాశనం చేసింది. ఇంకో విధంగా యిది బూర్జువా వాదుల్ని విప్లవ ప్రతికక్షుల్ని కూడా తృప్తి పరిచింది. వీళ్ళు దీన్ని ఊతగా తీసుకుని, విప్లవం, తీవ్రమార్పులు యివన్నీకూడా ప్రకృతి విరుద్ధాలనీ హానికరాలనీ వాదిస్తూ వస్తున్నారు. విప్లవాన్ని శాస్త్రీయంగా యెదుర్కొంటున్నాననే బూర్జువా పెద్దమనిషి, సాధారణంగా తన వాదాన్ని పరిణామ వాదం పేరు మీదుగా సాగిస్తున్నాడు. ప్రకృతి నియమాల్లో హఠాత్ సంఘటనలూ, ఉరకల మీద తీవ్రమార్పులు, జరగవనీ, అల్లా అనుకోటం పొరపాటనిన్నీ, అంచేత సమాజ విప్లవం, అసంభవమూ, అశాస్త్రీయమూ, అని, తెలివి తేటల్తో వాదిస్తున్నారు శాస్త్రజ్ఞుల మనుకొనే కొందరు మహానుభావులు.

అన్ని విషయాల్లోనూ, ప్రకృతి నియమాల్ని సామాజిక నియమాలతో సరిపోల్చడం కంతే తెలివి తక్కువ పని యింకోటి ఉండదనే దీనికి జవాబు. ఒక దాని యందు మనకుండే విషయ జ్ఞానం యొక్క ప్రభావం, యింకో దాని యందు విధిగా కనపడి తీరుతుంది. ప్రకృతి నియమాల యొక్క జ్ఞానం వలన సామాజిక శాభివృద్ధి కవకాశం ఉంటుంది. అంత మాత్రంచేత ప్రకృతి నియమాలికి సామాజిక సిద్ధాంతాలికి ముడి వెట్టడం గొప్ప పొరపాటు. ప్రకృతిలో మనం చూసే కొన్ని కొన్ని వింత సూత్రాలికి సమాజ నియమాలికీ యెక్కడా సరిపడదు. సంతానోత్పత్తికి స్త్రీ పురుష సంబంధమైన కొన్ని నియమాలు కారణంగా ఉంటూంటే, దానికి వివిధ రసాయనిక సమ్మిశ్రిత సూత్రాలు ముడివెట్టడం యెంత సమంజసమో, సామాజిక నియమాలికి, ప్రకృతి నియమాలికి ముడివెట్టడం అంత సమంజసం. పోనీ ప్రళయాల వల్లా, ఉరకల మీదా, జరిగే విప్లవ మార్పులికి ఒకవేళ విప్లవ ప్రతికక్షులు భయపడి, విప్లవాన్నే తోసి పుచ్చేసినా, చీమ నడకతో మెల్లి మెల్లిగా సాగే పరిణామాన్ని కూడా సాగనీకుండా అడ్డు తగులుతున్నారు ఛాందసులు. బూజు పట్టిన తమ నిర్జీవ వాదనలతో పరిణామం యొక్క గమనాన్ని కుంటువడ చేస్తున్నారు. ప్రత్యక్షంగా ప్రపంచంలో యెన్నో అద్భుతమయిన మార్పులు విప్లవ సంఘటనాల ద్వారా జరుగుతూంటే వాటిని చూస్తూ "అమ్మయ్యో! విప్లవమే" అని నెత్తీ నోరు కొట్టుకొంటూ, ఛాందసుల్లాగ భయపడి కళ్ళు మూసుకోలేక, "ప్రపంచానికి అద్భుతమయిన మార్పు, జీవం రావాలంటే ఒక్క విప్లవం వల్లే సాధ్య మవుతుంది" అని తెగేసి చెపుతున్నాడు విప్లవవాది. వివిధ జీవాణువుల్లో కొన్ని నిత్యమూ మారే పరిస్థితుల కలవాటు పడలేక, చాలా కాలం, ఏమార్పూలేకుండా, అల్లాగే ఉంటూ నశిస్తున్నాయనీ, కొన్ని జీవాణువులు పరిస్థితుల కనుగుణ్యంగా త్వర త్వరగా మారుతూ, విప్లవోద్వేగంతో విచ్ఛిన్నమయి, అనేక కొత్త స్వరూపానికి జీవం యిస్తున్నాయనీ, శాస్త్రజ్ఞులు ఋజువు చేశారు. అల్లా సమాజం కూడా, పరిస్థితుల కనుగుణ్యంగా, అలవాటు పడకుండా, తుప్పు పట్టిన పాత జీవితంతోనే తృప్తిపడి ఊరుకుంటే క్రమ క్రమంగా నిర్జీవ మవుతుంది.

అదల్లా అట్టిపెట్టి రోజూ మన కళ్ళెదట జరిగే విషయాన్ని పరిశీలిద్దాం. శిశువు యొక్క జన్మ చూద్దాం. శిశుజన్మ హఠాత్తుగా ఒక్క ఉరకలో జరుగుతుంది. యింత వరకూ మాతృగర్భంలో నొకభాగంగా ఉంటూ, స్వతంత్ర మయిన రక్త ప్రసరణ గాని, స్వతంత్ర మయిన చలన శక్తి గానీ లేని, పిండము, ఒక్క ఉరకతో, పాత జీవితాన్నంతా వదిలేసి, పాత సంబంధాన్ని తెగ్గొట్టుకొని, బయట పడి, స్వతంత్ర రక్త ప్రసారణమూ, స్వతంత్రంగా, గాలి పీలుస్తూ వదలే శక్తీ, స్వతంత్రంగా, ఆహారాన్ని తీసుకొంటూ, జీర్ణించు కొనే శక్తి, యిల్లాంటి క్రొత్త జీవిత పరిస్థితుల్లోకి ప్రవేశిస్తుంది. శిశువు యొక్క

(12 వ పేజీ చూడండి)

"మద్రాసు ప్రభుత్వానికి మా విన్నపం"

విద్యార్థి సంఘపు కనీసపు కోర్కెలు

నేటి విద్యార్థియే రేపటి పౌరుడు. విద్యార్థులమైన మాకు ప్రభుత్వము తీర్చవలసిన కష్టాలు చాలకలవు. కాని సామాన్యము, అవసరమూ అయిన యీ కనీస కోర్కెలనైనా కాంగ్రెసు ప్రభుత్వము వెంటనే తీర్చునని కృష్ణాజిల్లా విద్యార్థి సంఘము ఆశించుచున్నది.

1 మద్రాసు ఎడ్యుకేషనల్ రూల్సులోని 8 వ అధ్యాయము వెంటనే రద్దు చేయబడాలి. యీ అధ్యాయము విద్యార్థుల సామాన్యహక్కులకు భంగకారి. విద్యార్థులు రాజకీయములలో పాల్గొనుటకు హక్కుండాలి. యీ అధ్యాయము రద్దు చేసిన కాని విద్యార్థులకు శాంతిలేదు.

2 మాకు సత్వరమే ఆంధ్రరాష్ట్రము కావాలి.

3 విద్యావిధానాన్ని వెంటనే మార్చాలి. బడి జీతాలు సగానికి నగము తగ్గాలి. నూటికి కొంతమంది కంటే ఎక్కువమంది ప్యాసు కాకూడదనే నియమముండ కూడదు. పరీక్షలు శీతకాలములో జరగాలి. రోజు క్లాసు పేపరుండాలి.

4 స్కూలుఫైనలు సెంటరు ప్రతి స్కూలు లోనూ ఉండాలి. ఇప్పుడున్న పద్ధతివలన విద్యార్థులు వ్యయ ప్రయాసలకు పాల్పడుచున్నారు.

5 స్కూలుఫైనలు పరీక్షలకు మూడు సంవత్సరములు తప్పినవారికి ఛాన్సు లేదనే నియమాన్ని తొలగించాలి. కాలపరిమితి ఉండకూడదు.

6 స్కూళ్ళలో గేమ్సుఫీ, లైబ్రరీ ఫీ వసూలు చేస్తున్నప్పటికి ఏమీ సప్లై అగుటలేదు. యీ విషయమై జిల్లా బోర్డులను గవర్నమెంటు వత్తిడి చెయ్యాలి. టరము ఫీజ సగానికి సగము తగ్గాలి.

7 ఫోర్తు ఫారము లోనే పబ్లికు పరీక్ష పెట్టాలని ఆలోచించుచున్నట్లు తెలియుచున్నది. ఆపద్ధతి చిన్న విద్యార్థుల మానసిక వికాసమునకు భంగకరము.

8 హైస్కూళ్ళలో పొరుగూళ్ళ నుంచి వచ్చే విద్యార్థులకు టిఫెనుషెడ్లు ఉండాలి. యీవిషయంలో గట్టిగా ప్రభుత్వము జిల్లాబోర్డులను వత్తిడి చేయాలి.

9 విద్యార్థి సంఘాలను రికగ్నైజు చేయాలి. విద్యార్థులపై చూపబడే అవమానాలు, జరిమానాలు పోవాలి.

10 సంస్కృత కళాశాలలలోఉన్న విద్యా విధానాన్ని వెంటనే మార్పించాలి. హైస్కూలుకు సంబంధించిన ఎంట్రన్స్ కోర్సులో ఇంగ్లీషు, హిస్టరీ, జాగ్రఫీలు తప్పకుండా ఉండాలి.కాలేజీ కోర్సు పూర్తిఅయ్యే సరికి కనీసము స్కూలు ఫైనలు నాలెడ్జి అయినా ఉండేటట్లు ఏర్పాటుచెయ్యాలి.కాలేజీ కోర్సును 4 సంవత్సరాలనుంచి 3 సంవత్సరాలకు తగ్గించి నాల్గవ సంవత్సరము ట్రైనింగు ఏర్పాటు చెయ్యాలి. కనీసము యీవిధంగానైనా సంస్కృత విద్యా విధానాన్ని మార్చకపోతే యీసంస్కృత కళాశాలలను తీసివేయుటయే ఆ విద్యార్థులకు శ్రేయోదాయకము.

11 మిడిలు స్కూళ్ళు, హైస్కూళ్ళ విద్య నాలుగు సంవత్సరాలలో పూర్తి కావాలి.

12 విద్యార్థి సభలకు సి.ఐ.డీలు రావటం అవమానకరము. వెంటనే మాన్పించాలి.

ఈ పై కోర్కెలను కాంగ్రెసు ప్రభుత్వము వెంటనే అమలు జరుప వలెనని కోరుచున్నాము.

కాట్రగడ్డ రాజగోపాలరావు

ప్రధానకార్యదర్శి.

కృష్ణా జిల్లా విద్యార్థి సంఘం.

(11 వ పేజీ తరువాయి)

ఫ్రాన్సు— రష్యా ఒడంబడిక ననుసరించీ

జర్మనీ— ఇటలీ సంబంధమును బట్టీ

జర్మనీ— రష్యా విరోధాన్నీ బట్టీ

త్వర త్వరగా మారుతూ ఉంటాయి.

ప్రస్తుతము, జర్మనీ, ఇటలీ, జపానులు కమ్యూనిష్టు సంఘ వ్యతిరేకపు టొడంబడికలో చేరి. మిగిలిన ఫెట్టుబడిదారీ ప్రభుత్వాలను కూడ, కల్పుకొను ప్రయత్నిస్తూ ఉన్నాయి. ఆస్ట్రియా ,హంగేరియాలు, ఈకూటములో చేరినవే.

ఫ్రాంసు- రష్యా, జెకోస్లోవేకియా- రష్యా, పరస్పర సహాయపు టొడంబడికలతో ప్రస్తుతము కలసి వున్నాయి. లిటిల్ యెంటింటీ, బాల్కను యెంటింటీ (గ్రీసు, టర్కీ, రుమేనియా, యుగోస్లేవియాలు)లు ఎంతవరకు సుస్థిరముగ ఉంటాయో చెప్పలేము. లిటిల్ యెంటిటీలోని రుమేనియా, యుగోస్లేవియాలు, రష్యా జర్మనీ, ఇటలీల ప్రాబల్యమునుబట్టీ, తమ, అశక్తతనుబట్టీ, సోవియటుకు వ్యతిరేకంగా పనిచేయవచ్చు. ఈవిధంగా లిటిల్ యెంటిటీ విచ్ఛిన్నము కావచ్చు. జెకోస్లోవేకియా మాత్రము రష్యాతో నిలిచిపోవచ్చు. అట్లే, బాల్కను యెంటిటీలోని టర్కీ తప్ప మిగిలినవి రష్యాకు వ్యతిరేకంగా పోవచ్చు. టర్కీ తటస్థంగానో, రష్యావైపో నిల్చిపోవచ్చు.

ఫ్రాంసులో కూడ స్పెయినులోవలె యుద్ధము ఆరంభముకావచ్చు. మొన్నటి కుట్రలను సకాలములో కనుగొనియుండకపోయినచో ఈపరకే ఆరంభము కూడ అయి యుండేది

బ్రిటను జర్మనుతో సహకారము చేయడానికి పూనుకుంటూఉంది. మొన్న హాలిఫాక్సు ప్రభువు (లార్డు ఇర్విన్) యొక్క ప్రయాణములో ఇది తేటతెల్లమైనది. తనతోపాటు ఫ్రాంసును ఈడ్చేది, లేనిదీ, ఫ్రాంసులోని సోషలిస్టులు, కమ్యూనిస్టులు, లేవగలగిన ప్రజా ఉద్యమము ననుసరించి ఉంటుంది. అంతేగాక జర్మనీతో బ్రిటను ఎంతవరకు పోతుందనే సమస్య, జపాను, చైనాలో బ్రిటిషు హక్కులకు, గౌరవించేదాన్నిబట్టీ కూడ ఉంటుంది. జపాను, అమెరికా- బ్రిటనుల మధ్య కలయిక రాకుండా, చేయాలని చూస్తుంది. బ్రిటనుకు సౌకర్యాలను కలిగించి అమెరికాను దూరముగ ఉండేటట్లు చేయవచ్చు. ఆపరిస్థితులలో బ్రిటను జపాను జర్మనీలతో మరింత దగ్గరిగా రష్యాకు వ్యతిరేకంగా పాల్గొనవచ్చు. లేదా తటస్థంగా ఉండవచ్చు.

అయితే బ్రిటను వైఖరి, బ్రిటిషు సామ్రాజ్యములోని ప్రజలు, కూలీలు, రైతులు,వివిధపార్టీలపై ఆధారపడి వుంటుంది. వలసరాజ్యాలలోని,స్వాతంత్ర్యోద్యమం తీవ్రంగావుండినచో ప్రపంచ వ్యవహారాల్లో లోక్యం కలుగచేసికోదు. లేనిచో రష్యాకు వ్యతిరేకంగా జర్మనీ, జపానులతో చేరవచ్చు.

యర్రకాలువ ముంపు

యర్రకాలువ పాపికొండలలో పుట్టినది. అక్కడనుంచి సుమారు 10 మైళ్లదూరము పారి రెండుపాయలుగాచీలినది. ఒకపాయకు,బైనేరు అనిపేరు.రెండవపాయ యర్రకాలువ అని పిలుస్తారు. మొదటిపాయకు తూ. గో. జిల్లాలోని రామన్న గూడెం వద్ద. ఆనకట్టు కట్టినారు. కాని దాని యుపయోగమువిమియు లేదు. అందుచే సరిపల్లి, దిప్పకాయలపాడు, తిరుమాలపురం గ్రామములకు చాలా పంట నష్టము కలుగుచున్నది. రెండవపాయ బొర్రంపాలెం గుండేపల్లి, దేవులపల్లి మీదుగా పారి పోతవరం వద్ద మొదటిపాయతో కలసి, త్యాజంపూడి మీదుగాపారి. ప. గో. జిల్లాలోని భీమవరం తాలూకాలో కొల్లేరులో కలియుచున్నది.

దీనివల్ల సుమారు 45 గ్రామముల వరకు పంటలు పాడైపోవుచున్నవి. యిదివరలో దీనిని గురించి ఎన్ని మొర్రలుపెట్టుకున్నను వినిన వారు లేరు.రైతువర్గము శాసన సభాఎన్నికలలో కాంగ్రెసుకు సర్వవిధములా తోడ్పడినది.యీ ముంపు గురించి తగుశ్రద్ధ వహించి తమకొరుకు పాటు పడెదరనినమ్మినది. కాని యిప్పటి వరకు దీనిని గురించిప్రయత్నము చేసిన మహానుభావుడు లేడుగదా యని నిస్పృహ చెందుచున్నది. గాన నియోజక శాసనసభాసభ్యులు, రైతులకష్టములు గుర్తెరింగి పాటుపడిన గాని కాంగ్రెసు గౌరవమునకు భంగము కలుగును. గాన యీ కాలువ పొడుగునను లోతుగ త్రవ్వినను లేక గుండేపల్లివద్ద ఆనకట్టుకట్టిన చాలావరకు ముంపు తగ్గుటయే గాక ఎగువ భూములు పల్లపు సాగుకు వుపయోగ పడునని మనవి చేయుచున్నాను.

దినవహీ హనుమంత రావు

రాజమంద్రి తాలూకా రైతుసంఘ కార్యదర్శి.

వ్యాసకర్తలకు మనవి.

(1) వ్యాసములు, పద్యములు, పాటలు, కథలు కృతజ్ఞతతో స్వీకరించెదము. ప్రచురణ యోగ్యములయినవి మాత్రమే ప్రకటించెదము.

(2) వ్యాసములు సాధ్యమైనంతవఱకు వ్యావహారికముగానే యుండవలెను.

(3) సిరాతో పేజీకి ఒకవైపున మాత్రమే వ్రాయవలెను.

(4) అక్షరాలు విడిగాను, స్పష్టముగాను ఉండవలెను.

(5) ప్రచురింప బడని వ్యాసములు అణా బిళ్ళ పంపినగాని తిరుగ పంపబడవు.

(6) వ్యాసాలు బుక్కు పోస్టులో పంపువారు, అతికించునపుడు కవరును మూసివేయరాదు. ఏ మాత్రము మూసినను పోస్టలుఅధికారులు రెట్టింపు చార్జిని గైకొనుచున్నారు. కాన వ్యాసకర్తలు మెలకువతో నుండవలెను.

సంపాదకుడు.

★ నేటిప్రపంచం ★

★ స్పెయిన్ విజయం.

★ బ్రిటకాలో చీలికలా ?

★ పాలస్టయిన్ హత్యలు

★ మన కర్తవ్యం

చైనా జపాను యుద్ధం గొడవలోబడి స్పెయిన్ విషయమే మఱచిపోయాం ఈమధ్య. మనమేగాదు, మనతోపాటు పత్రికావిలేఖరులూ.

"స్పైన్ ప్రభుత్వం ఇంకా ఓడిపోలేదు. ప్రజా స్వామ్య రక్షణ కోసం ప్రభుత్వాన్ని సమర్థించాలని" ఉపన్యసించి నందుకు పార్లమెంటు సభ్యుడు "అట్లీ" పై సెన్సార్ తీర్మానం తెచ్చాడొక సభ్యుడు. ఆయునకింత హడలు పుట్టడానికి కారణం ఏమిటి? అది నేడు బ్రిటన్ అవలంబించ వలసిన రాజనీతికి దెబ్బఅని....

అట్లీ ప్రకటనతో పాటు ఒకవారం దినాల నుండి ప్రభుత్వ విజయవార్తలు వస్తున్నాయి. టెరూయల్ నగరం విద్రోహుల చేతుల నుంచిప్రభుత్వం లాగి వేసింది. 1500మందిని ఖైదీలుగా పట్టుకున్నది కూడాప్రభుత్వం. ఇంకా ఆరవవంతు మాత్రం విద్రోహుల చేతుల్లో ఉందని కూడా ఒకవార్త. ఏది ఏమయినా ఈ విజయం వల్ల, స్పేనిష్ ప్రజల ఓపిక ధైర్యసాహసాలు మొండిపట్టుదల ప్రకటిత మవుతున్నాయి. ఇంతేగాదు నాల్గురోజులు అన్నపానీయలు లేకుండ బాధ పడుతున్న ప్రజలకు సహాయం కావించారు. యుద్ధంలో గాయపడ్డవారిని—శత్రువులు—అనిమైనా ఎంచకుండా కట్లుగట్టారు. మందులిచ్చారు. ఇదే జపాన్ అయితే బ్రతికి ఉన్న వాళ్ళను ఒక త్రాడుకు గట్టి ఉరిపోసేది. చచ్చిన శవాలను బైనట్లతో పొడిచేది....

టెరూయల్ పోతున్నదని కసిచేత విద్రోహులు బార్సిలోనాపై బాంబుల కురిపించారు. ఒకసారిగాదు. మూడునాల్గుసార్లు. అయినా చచ్చినవారి సంఖ్య 15—20 దాటలేదు. కారణం? ప్రజలు అలవాటుపడిపోయారు. బాంబుల వర్షాలనుండి తప్పించికొనే ఉపాయాలు మామూలై పోయినవి. అదీగాక ప్రజలు పట్టణాలవిడిచి, సైనికులే స్వరక్షణ చేస్తున్నారు కూడ.

టెరూయల్ విజయంవల్ల ప్రాణం పోతున్న వానికి కాస్త ఊపిరి మళ్లా వచ్చినట్లు సంతసం గల్గుతుంది.

నాన్ ఇంటర్వెన్షన్ అంటూ మొదలెట్టగానే చాలా మంది "అది ఇంకా ఉన్నదా ఏమిటి" అని ప్రశ్నించుకొంటారు. నిజమే. నానాజాతి సమితికీ- నాన్ఇంటర్వెనన్స్కు యతిప్రాసలు కుదరటమేగా కుండా, నిజమైన స్వామ్యం ఉంది. కమిటీలు,ఉపసంఘాలు వేస్తూ కాలం పుచ్చడం నానాజాతి సమితికి ఎంత అలవాటో నాన్ ఇంటర్వెన్షన్ కూడా అంత మామూలే.

సంవత్సరన్నర అయింది విద్రోహులు యుద్ధం ప్రారంభించి. అయినా ఈకమిటీ చేయ గల్గిందే మున్నది? ఇప్పుడు విదేశ వాలంటీర్లను స్పెయిన్నుండి మరల్చడాన్ని గురించి విచారించడానికి జనవరి 21 వ తేదీన ఒక కమిషన్ బయలుదేరుతుందట! దొంగలుపడ్డ ఆరు నెలలకు కుక్కల మొరగడం....

నాన్ ఇంటర్వెన్షన్ గాని, నానాజాతి సమితిగాని ఇంత మాంద్యంగా ప్రవర్తిస్తున్నదంటేబ్రిటనేకారణం. ఈరెండిటిలోనూ ప్రముఖస్థానం వహించింది బ్రిటన్.

బ్రిటన్లో చీలికలా?

ఇదివరకే చెప్పినట్లు బ్రిటన్ఫాసిస్టులకు లొంగుతూఉన్నది. లొంగడం అంటే ఒక్కసారిగా ఫేసిస్టులందరికీ వరుసగా తల వ్రొగ్గటం గాదు. బ్రిటన్ను ఎదుర్కొనేవి రెండు ముఖ్యసమస్యలు. ఒకటి మధ్యధరాసముద్రం, రెండవది తూర్పుదేశాల సమస్య. తూర్పున అటు జపాను భయపెడుతూఉంది. ఇటు అబిసీనియా ఆక్రమణతో ముస్సోలినీ భయం అధికమయింది. ఇపుడు నాజీ జర్మనీతో స్నేహంచేయడమా లేక ఫేసిస్టు ఇటలీతో చేతులు కల్పడమా అన్నది బ్రిటనును కలవరపెడుతున్నది.

ఒకముఠా ముస్సొలినికి కొంత లంచం ఇచ్చి జర్మనీ ఇటలీల సంధిని భగ్నంచేయడం. దీనికి ఈడెన్, సర్ రాబర్ట్ వేన్సిట్టార్ట్ మొదలైనవాళ్ళు.

రెండవముఠా జర్మనీతో వలసరాజ్యాల విషయమై బేరంచేసి దానిస్నేహం సంపాదించాలని. దీనికి అనుకూలురు శామ్యూలుహోర్, జాన్సైమను సర్కింగ్స్లీవుడ్, లార్డ్హాలిఫాక్సు (ఇర్విన్) మొదలైనవారు.

హాలిఫాక్సు జర్మనీ సందర్శనానికి తెరవెనుక చాల నాటకం జరిగిందనీ, ఈవిషయంలో అభిప్రాయభేదాలేర్పడి ఈడెన్ రెండుసార్లు రాజీనామా ఇచ్చాడని బ్రిటిష్ అమెరికను పత్రికలలో వదంతులు పుట్టాయి.

జర్మనీతో సంధి సంప్రదింపులు హాలిఫాక్సు, లోధియన్, టైమ్సు పత్రికా సంపాదకుడుమొదలైనవారంతా సెప్టెంబర్ అక్టోబర్లలోనే జరిపారినీ. మరికొన్ని రహస్య కథలు బయటపెట్టింది "రైనాల్డ్సున్యూస్"

హాలిఫాక్సు ముఠా, జర్మనీ, ఆస్ట్రియా, జకొస్లొకేవియాలపై దాడిని సలిపితే స్వేచ్ఛగా వదలటం, బ్రిటనును జర్మనీ తనపూర్వ వలసరాజ్యాలను 6 ఏండ్లదాకా అడగకుండా ఉండటానికే అంగీకరించినదట. పైగా బ్రిటను పెట్టుబడిదార్లు బ్యాంకర్లు జర్మనీకి పెట్టుబడి పెట్టడానికికూడ తయారయ్యారట.

లార్డు హాలిఫాక్సును జర్మనీకి పంపించాలని తీర్మానించినపుడు ఈడెను బ్రసెల్ కాన్ఫరెన్సులో ఉన్నాడని, ఈవార్త తెలియగానే రాజీనామా ఇచ్చాడని వదంతి. కాని ఈలోగా ఈడెన్ను రాజీనామాను ఉపసంహరించుకొనేటట్లు చేశారు.

ఈవార్తలన్నీ బయటపడిపోయినయి. అయ్యో గుట్టు రచ్చకెక్కిందే అని కొందరు గోలపెడుతున్నారు. శాంతిప్రియులు, యుద్ధవ్యతిరేకులు, ఫేసిస్టు విరోధులు యూరప్ శాంతిని హిట్లర్కు అమ్మచూపడం సిగ్గు అన్యాయం అంటూ గోలచేస్తున్నారు.

ఈనాడు బ్రిటను జర్మనీతో కలిసి, సోవియట్ స్నేహంవిడనాడే సమస్య బ్రిటిష్ వలస రాజ్యాలలోని స్వాతంత్ర్య ఉద్యమాన్ని బట్టీ, బ్రిటిష్ కార్మికోద్యమం తీవ్రతనుబట్టీ ఉంటుంది. వలసదేశాల స్వాతంత్రోద్యమం అంటే పాలస్టయిను కన్పడుతుంది.

పాలస్టయిన్ హత్యలు.

"ఒక పదహారేండ్ల కుర్రవాడికి ఆరునెలలుశిక్ష. తక్కిన 9 గురికి ఒకోసంవత్సరం. పోలీస్టు క్వార్టర్లలో ఆరబ్బులను చాలమందిని ఉరితీశారు. వారి ఆయుధాలను లాగివేశారు. ఆరబ్బులతోటి సంఘర్షణలో 11 మందిని బ్రిటిష్సైనికులు కాల్చారు. జాపా తీర్పులో నల్గురికి మరణదండన." ఇవీ ఈవారం పత్రికలు తిరగవేస్తుంటే పాలస్టయిను వార్తలు. పాలస్టయిను స్వాతంత్ర్యపోరాటం చూస్తుంటే మన 1930—32 ఉద్యమం జ్ఞప్తికివస్తుంది. ఆరోజుల్లో, కార్మికుల్లోకి, క్రిందితరగతుల్లోకి ప్రాకకుండా, తగిన సంఘటనం లేనిపోరాటం సాగించాం మనం. ఈనాడు పాలస్టయిను లోకూడవిసువుచెంది,నిస్పృహగల్గి సంఘటిత ప్రజాఉద్యమాన్ని లేవదీయలేక మనదేశంలోని టెర్రరిస్టుల లాగానే వ్యక్తిగతహత్యలకు పాల్పడుతున్నారు. ఈస్వాతంత్ర్య యోధుల్ని క్రూరంగాను, అమానుషంగాను బ్రిటిష్ సామ్రాజ్యవాదం అణచివేస్తున్నది.

మనకర్తవ్యం

ఒక ప్రపంచయుద్ధమే వస్తే ముందు తన ఇల్లు చక్క బెట్టుకోవాలి. అందుకనే మొదటి సరి హద్దులలో తమబలం ప్రయోగించి కొంత శాంత పరచింది బ్రిటను. కలకత్తా, బొంబాయి, మద్రాసులలో యుద్ధ సన్నాహాలకు వలసిన రక్షణఏర్పాట్లు అన్నీ గావించుతుంది.

ఇకరాజకీయాలు—కాంగ్రెస్ పదవులు ఆక్రమించిననాటినుండీ బ్రిటను ఆట్టే మొరటుగా ఉండటంలేదు. టెర్రరిస్టుల్ని, డెటిన్యూలను వదలి పెట్టారు. అల్లరి చేస్తున్న ఇంగ్లీషు ఉద్యోగస్థులను బయిటికి పంపించారు. ఏవో చిన్నచిన్న మార్పులు చేస్తున్నారు కాంగ్రెసువారు. బ్రిటను మాటాడటంలేదు. కాని, అతివాదుల్ని, సోషలిస్టుల్ని కమ్యూనిస్టుల్ని కాంగ్రెస్ మంత్రివర్గంచేతనే కాస్తతొక్కిపట్టి వుంచాలని యెత్తులువేస్తున్నది. ఈమాత్రం స్వేచ్ఛకూడా అనాడు లాఠీలతో, తుపాకిగుండ్లతో ఉద్యమాన్ని అణచిన బ్రిటను ఎందుకు ఇస్తున్నది? యుద్ధభయం....

ఫెడరేషన్ మరొకసమస్య మనకు. "బ్రిటిష్ సింహం ముసలిదయింది. ఫేసిస్టులు దాని చెవిపట్టుకు లాగుతున్నారు. మనంకూడా తోక మెలిపెడదాం. కొన్ని సంస్కరణలు లాక్కుందాం" అని సత్యమూర్తి బూలాభాయల ఎత్తు. వారికి స్వాతంత్ర్య పోరాటం కంటె ఇలా గిల్లి కాజేయడమే హాయి. లోధియను, శామ్యూల్ రాకలు,జట్లండ్ భాషణాల వల్ల ఒకవిషయం తెల్లమౌతున్నది. కాంగ్రెసులోని అతివాదుల్ని మెత్తగా మొట్టుతూ, మితవాదులకు కొద్దిపాటి సంస్కరణలు పారేయడం. కాంగ్రెస్ మితవాదులు తమ ప్రతిష్ట హెచ్చిందని మురుసుకుంటూ వారిచేతిలో పడటం బ్రిటన్కు కావాలసింది.

అందుకనే ఈయుద్ధభీతి తాండవిస్తున్న రోజుల్లో అతివాదుల చాకచక్యంబట్టీ ఉంటుంది మనస్వాతంత్ర్య పోరాటం.

ఈనాడు మితవాదుల కుట్రలకులోనై అతివాదులలో చీలికలు తెచ్చుకొన్నా, సంయుక్త సమిష్టి ప్రతిఘటన మానినా మనదేశానికిక మోక్షం ఉండదు. ఈతరుణంలో మనం తప్పటడుగువేస్తే మనకేగాదు- మనదేశానికేగాదు, మనపిల్లలకు ద్రోహంచేసిన వారమౌతాం.... యుద్ధంలో చిక్కనివున్న బ్రిటన్తో మనం తగినంత పోరాటం సల్పితిమా, బ్రిటన్ జర్మనీకిలొంగి రష్యాపై కత్తికట్టడానికి అవకాశం గల్గదు, కాబట్టి—

అతివాదులలో ఐకమత్యమూ, సామ్రాజ్యవాద వ్యతిరేక సమిష్టి సంఘటనా ఉంటే, మనం మనస్వాతంత్ర్యం సంపాదించుకొంటాం! పాలస్టయిను లాంటి సోదర దేశాలకు మోక్షమూ ఇప్పిస్తాం!! ప్రపంచ కార్మిక వర్గమంతా ఆశపెట్టుకొన్న రష్యానూ రక్షిస్తాం!!!

పాఠకుడా! యుద్ధంవస్తే నీవు...

నవశక్తి

29—12—37 బుధవారం

వైస్రాయి:
ఫెడరేషన్

కొన్ని ముఖ్యమైన చిక్కు సమస్యలు తేలితేనేగాని తొందరపడి 'ఫెడరేషనును స్థాపించుట తెలివితక్కువ' యని వైస్రాయిగారు పల్కిన చిలుకపలుకులవల్ల నెవ్వరూ మోసపోవు వారెవ్వరునులేరు. కలకత్తా అసోసియేటెడ్ ఛేంబర్సువారి యెదుట వైస్రాయిగారు కలిపిచ్చిన పై మాటలలోని అంతరార్థమేమి?

ఫెడరేషనును నిరాకరిస్తూ అఖిలఇండియా కాంగ్రెసు కమిటీవారి తీర్మానము స్పష్టంగానే ఉన్నది. ఫెడరేషనువస్తే అధికారాలు మనమే ఆక్రమించాలని సత్యమూర్తిగారు వాదించుచున్న అనర్థ యుతీర్మానముయొక్క విలువను యేమాత్రం తగ్గించదు. ఫెడరేషను నిర్మాణ విషయంలో ప్రధానపాత్ర ధరించిన లోథియన్ ప్రభువు తొందరపడి విందారగించిన బూలాభాయిగారి వైఖరి గర్హనీయమైనను కాంగ్రెసు తీర్మానానికి కళంకాన్ని తెచ్చిపెట్టదు. ఫెడరేషనును భారతదేశముపై రుద్దుటకుండ కాంగ్రెసు మంత్రులుకూడ ఖండితముగా చెల్పవలెనని యిటీవల జరిగిన కలకత్తా అఖిలఇండియా కాంగ్రెసు మీటింగులో శాసింపబడియేయున్నది. కాంగ్రెసు మహాసంస్థయొక్క నిర్ణయాన్ని, దేశీయుల ఆందోళనను త్రోసిరాజని ఫెడరేషనును బలవంతంగా రుద్దినట్లయితే మంత్రులు రాజీనామానిచ్చి దేశములో 'ప్రత్యక్ష ప్రజాపోరాటము' సాగింపవలయునని యిటీవల కాంగ్రెసు సోషలిస్టు పార్టీవారు తీర్మానించియే యున్నారు. అందుచేత తొందరపడుట తెలివితక్కువ యని వైస్రాయి గారిమాటలలోని అంతర్యమేమి?

ఎందులకీ ఆలస్యము? ఏమిటీ చిక్కు సమస్యలు? ఏవో కొన్ని షరతులపైని కాంగ్రెస్ నాయకులతో రాజీ జరుగుతేనేకాని ఫెడరేషను అమలులోకి వచ్చుట అసంభవమని వైస్రాయిగారికి పూర్తిగా తెలుసు. లోథియన్ ప్రభువుగారిప్పుడే నాయకులతో సంభాషణలు సాగిస్తున్నారు. కాంగ్రెసు మంత్రుల పరిపాలన క్రమంగాను కమ్మగాను ఉందని జెట్లెండు ప్రభువు బాగా బుజ్జగిస్తున్నాడు. "రాష్ట్రాలలో మనకు పొత్తుకుదిరి సుఖంగా వ్యవహారం నడుస్తున్నప్పుడు అఖిలఇండియాలోమాత్ర మెందుకు విరోధమని పృచ్ఛచున్నరు సామ్రాజ్యాధికారులు.

స్వదేశసంస్థానాధీశులు సైతమింకను ఫెడరేషనులోనికి వచ్చుటకు సంశయిస్తున్నారు. సంస్థాన ప్రజలకు కాస్త ప్రాతినిధ్యమైనను ఫెడరేషనులో లేకపోయినను యిటీవల అచ్చట జరుగుతూన్న ప్రజాందోళనను గాంచి భయపడుతున్నారు. ఫెడరేషనులో తమకున్న అధిక ప్రాతినిధ్యమింకను చాలదని వారి యభిప్రాయం. మొత్తముమీద కాంగ్రెసు వైఖరి ఫెడరేషను విషయమై తృప్తికరంగానే ఉన్నది. కాని సామ్రాజ్యవాదుల ఆర్భాటాల నెదుర్కొనగల సామ్యవాద అతివాదకక్షను బలహీనపరచుట మాత్రము తెలివితక్కువని మాయభిప్రాయము. మైసూరువంటి సంస్థానములో జరుగుతూన్న సత్యాగ్రహపోరాటాన్ని చులకన జేయుట కూడపొరపాటు. నిజంగా ఫెడరేషను భగ్నముచేయుగల శక్తులను సడలించ జేయుట స్వాతంత్ర్యపోరాటానికి చాల ప్రమాదకరమని చెప్పసాహసిస్తున్నాము.

మైసూరు నిర్బంధవిధానాన్ని ఖండిస్తూను, స్వాతంత్ర్యమోహుల సత్యాగ్రహ నిరసనన్నాహాలను ప్రశంసిస్తూను అఖిలఇండియా కాంగ్రెసు కమిటీ గావించిన తీర్మానాన్ని తృణప్రాయంగా గాంధిమహాత్ముడు త్రోసిపుచ్చి సంస్థానాధీశులకు సాయమొనర్చుచున్నాడు. రైతుయువజన సామ్యవాదులపై దౌర్జన్య మిథ్యారోపణలన్నిటిని సైతము గావించి వారిని అణచిపెట్టు యత్నములకు సామ్రాజ్యవాదులుసంతసిస్తున్న సంగతి కాంగ్రెసు నాయకులు గమనించాలి. తీవ్రవాదశక్తు లన్నిటిని కాంగ్రెసునాయకులు కాంగ్రెసు మంత్రివర్గాలు పూర్తిగా నీరసపరిచేలోగా "తొందరపడి ఫెడరేషనును స్థాపించుట తెలివితక్కువ" యని వైస్రాయిగారి పల్కులలోని అంతరార్థము. గతసాలున మాట్లాడుతూ సంవత్సరం తిరిగేలోగా ఫెడరేషను వచ్చి తీరునని ఘంటాపథంగా చెప్పి తొందరపడిన, వైస్రాయినేడు "తొందరపడుట తెలివితక్కువ" యని చెప్పుటలోని అంతర్యమును దేశీయులు గమనించెదరుగాక యని కోరుచున్నాము. 'నిర్బంధవిధానము'(Repression) సమాధానము (Conciliation)— యీ రెంటిని యేకకాలముననే నడిపించుట సామ్రాజ్యవాదు లవలంబించు చిరకాల రాజనీతి.అతివాదశక్తుల నడచిపెట్టి మితవాదులను చేరదీసి సంస్కరణముల ప్రవేశపెట్టుట పరిపాటి. తిలక్‌ను నిర్బంధించి గోక్లేను చేరదీసి మింటోమార్లీ సంస్కరణలను ప్రవేశపెట్టినారు. పంజాబు హత్యల విడుపనే మాంటేగ్యుచెల్మ్స్‌ఫోర్డు సంస్కరణాలను ప్రసాదించినారు. 1935వ సం॥ చట్టముకూడ తీవ్రనిర్బంధ విధానానంతరమే ఆమోదింపబడినది. ఇప్పుడు ఫెడరేషనును ప్రవేశపెట్టుటకు కాంగ్రెసు నాయకులతో కపట రాజీప్రయత్నపు ప్రసంగములు, సామ్యవాదులపై సమరాస్త్రప్రయోగములు యేకకాలముననే జరుగుతున్నాయి. ఇదొక్కటే తేడా. ఇదివరలో 'నిర్బంధ సమాధానములు' రెండునూ సామ్రాజ్యవాదుల చేతిమీదిగనే జరుగుచుండెడివి. ఇప్పుడో సమాధానప్రయత్నాలు మాత్రము తాము చేయుచు 'నిర్బంధవిధానము' నమలు జరుపుట మాత్రము కాంగ్రెసు మంత్రివర్గములకు విడిచిపెట్టినారు. కాంగ్రెసునాయకులు, కాంగ్రెసు మంత్రులు యీరహస్యమును గుర్తించాలని కోరుతున్నాము.

★ వ్యాఖ్యలు ★

పట్టాభిరామయ్య తిగాదాలో వకీలుదేపై చెయ్యి అయింది. మహాత్మాగాంధిగారు సైతం వారిమను పైకారాలు మిరియాలు నూరేరు. "బాధ్యతగల యే పదవికి పనికిరాడు" అని కాంగ్రెసు వర్కింగుకమిటీవారు కూడ ఖండించారు నారిమన్‌ను. సత్యమెట్లున్నా, వర్కింగుకమిటీవారి అభిప్రాయాన్ని గౌరవించి బొంబాయిరాష్ట్ర కాంగ్రెసు సంఘాధ్యక్ష పదవికి రాజీనామా నిచ్చాడు నారిమన్. కాంగ్రెసు ప్రతినిధుల యెన్నికలలోనిల్చి తనమీద ప్రజాభిప్రాయాన్ని పరీక్ష చేద్దామనుకొన్నాడు. పరీక్షలో పూర్తిగా గెల్చాండేడు. అందరిలోకి అగ్రస్థానం వహించాడు. నాయకులాడిన నాటకానికి న్యాయమైన జవాబిచ్చారు కల్లకపటము తెలుగని ప్రజలు.

★

'కాంగ్రెసువాది, కల్లలు'

'కాంగ్రెసువాది' యనుపేరుతో ఆంధ్రపత్రికలో సామ్యవాదులపై కల్ల బొల్లిప్రచారాన్ని చేస్తూ ప్రకటింపబడిన వ్యాసాన్ని చూస్తే చాలా ఆశ్చర్యమైంది. తనపేరును వెల్లడించుకొనడానికి వెన్నెముక లేకపోయింది ఆకాంగ్రెసువాదికి. బాధ్యత గలవారిపై బాణలు బాదినప్పుడు నిర్భయంగాపేరువెల్లడించుకొనుట మర్యాదస్తుని లక్షణం. వ్యక్తిగతమైన తీవ్రవిమర్శలు ప్రకటింపవలసి వచ్చినప్పుడు పేరును ప్రచురింప వెనుదీయువారికి తావీయకుండుట సామాన్య పత్రికానీతికి లక్షణము. కాంగ్రెసు

ప్రతినిధుల యెన్నికలు జరుగుతున్నప్పుడే సమయమని సామ్యవాదులపై చాటుదెబ్బలు కొట్టుట కాంగ్రెసపత్రిక వంటి ఉత్తమపత్రిక సాయపడుట శోచనీయము. పట్టాభి, బ్రహ్మయ్యగార్లపై ఆక్షేపణలు తెల్పు ప్రకటనను వేరొకచో ప్రచురించినామంటే బాధ్యతగలవారి సంతకాలు ఉన్నందువల్లనే.

"ఇక కాంగ్రెసువాది" చేసిన ఆరోపణలు కేవలము అసత్యములు. లింగరాజు, రంగశాయి వగైరాలు సామ్యవాద కక్షినుండి విడిపోయారట. సత్యానికింతకంటె దూరమైన వార్తయింకొకటిలేదు. ఆప్రకటన ఆదినుండి అంతంవరకు అబద్ధాలతోనిండిన తప్పుల తడకయని వేరుగ చెప్ప నవసరంలేదు.

★

"ప్రజాక్షేమానికి" భగంకరమా?

తమిళనాడు రాష్ట్రకాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యదర్శియైన కామ్రేడ్ జీవానందంపై సి. ఐ. డి పోలీసు నిఘాఉన్నదా? ఉంటే యింకా యెంతమందిమీద ఉన్నది? అని మదరాసు శాసన సభలో ఆర్. వెంకటసుబ్బారెడ్డిగారు అడిగితే ప్రధానమంత్రిగారు ఆప్రశ్నలకు జవాబిచ్చుట "ప్రజాక్షేమానికి" భంగకరమని బదులు చెప్పేరు. కాంగ్రెసువాదులవెంట కాంగ్రెసుమంత్రులు పోలీసులను తగిలించి పై పెచ్చు ప్రశ్నిస్తే జవాబివ్వడమే ప్రజాక్షేమానికి భంగకరమని శెలవిస్తున్నారు. 'ప్రజాక్షేమాన్ని' గుర్తించే పాపమీమధ్య తీసివేయబడిన నిఘాను కామ్రేడ్ లింగరాజు పై తిరిగి తగిలించారు. తోటి కాంగ్రెసువాదులపై సి. ఐ. డీ. లను నియమిస్తేనేగాని రాజ్యచక్రాన్ని నడుపజాలని అప్రయోజకత్వమే నిజంగా 'ప్రజాక్షేమాని' కనర్థదాయకము. మదరాసులో కాంగ్రెసు మంత్రివర్గం వచ్చినపిమ్మట సామ్యవాదులపై సి. ఐ. డీ. ల ఆర్భాటాలు మరింత హెచ్చుగుట శోచనీయము.

అఖండవిజయం

కాంగ్రెసుప్రతినిధులయెన్నికలు

తుని నియోజక వర్గం

కంభంపాటి సత్యనారాయణ ఎం. ఏ. గారికి(సోషలిస్టు) 807 యం. తిరుమలరావు యం. యల్. ఏ (ఢిల్లి)గారికి 178 ఓట్లువచ్చాయి. సత్యనారాయణగారెన్నుకొనబడిరి.

మద్రాసు.

విజయమొందిన మద్రాసుపట్టణ ప్రతినిధులు 9 గురిలోను సోషలిస్టులగు పి. రామమూర్తి, బి. శ్రీనివాసరావు గార్లకు రెండవ నాల్గవస్థానములు లభించినవి.

★ వాకూ—విరూ ★

(చక్కెర్ వాలా)

రాజాజీగారిలాగ బిక్కిన వెంకటరత్నంగారు విశ్రాంతిని విరమించి తిరిగి రాజకీయాలలో ప్రవేశించారు. రాజాజీగారిని వెంటనే ప్రధానామాత్యపదవి వరించింది. బిక్కినవారి భాగ్యరేఖ యెట్లుందో? లోని గుట్టు పెరుమాళ్లు కెరుక.

....

సుబ్రాయన్‌గారు మంత్రి అయితే మహర్షి సాంబమూర్తిగారు త్రినేత్రం తెరుస్తానని హుంకరించారు రాష్ట్రకాంగ్రెసు సంఘ నిరుమసభలో. స్పీకరుపదవినిచ్చి మూడోనేత్రం మూయించి శాంతింప చేయడం వల్ల కామసుమూంది సుబ్రాయన్‌గారు మంత్రికావడమున్ను మహర్షివారి మండల రాజకీయ మహాసభకు ప్రారంభోత్సవకులుగా రావడమున్ను.

....

'స్టేటర్డర్ల మునసబు గాయం చేశాడు మావూళ్ళోను. ఎలెక్షను పిటీషను పడడమేదాలు స్టేటర్డరిచ్చారన్న మాటే. కబురొచ్చిందంటేచాలు స్టేటర్డ రివ్వడానికి మనరాష్ట్ర కార్యదర్శి బ్రహ్మయ్యగారికి. అందులోనూ అన్నీ ఎక్సుపార్టీ ఆర్డర్లే. రేపు పోలింగయితేయీవేళ స్టేటర్డరు! పోలింగయితే వోట్లపెట్టెలు విప్పకుండా 'స్టేటర్డరు! విప్పితే గెలుపు చెల్లేరు చేయకుండా స్టేటర్డరు. నాల్గురూపాయలు ఖర్చుపెట్టుకొని బందరు దాకా పోవాలి. అవతలపార్టీ సామ్యవాదులో అతివాదులో కావాలి. అంతే ఆర్డరు వచ్చిందన్నమాటే. లాయరైన సాంబమూర్తే లక్షరెట్లు మెరుగురా యని పిస్తున్నాడు రైతు బ్రహ్మన్నయ్య.

... .

మద్యపాననిషేధం ఒక్క సేలంలోనే కాని యితర జిల్లాలలో కాదనుమాయని విశాఖపట్నంలో దుడుకు యువకులకు చూపడానికే నిజంగా డి. యల్. యన్ రాజు యం. యల్. ఏ గారు సారాబట్టీకి లైసెన్సు కోరడమున్ను తెన్నేటి విశ్వనాథంగారు వారిని మందలించక పోవడమున్నూ. వచ్చేలాభంలో కొంతభాగం "కుర్రకుంకలను" కూర్చోపెట్టడానికి కూడివస్తుంది కూడాను.

జమీందారీ విచారణ సంఘం

రైతుల రాయబారం

మద్రాసు ఎస్టేటుల్యాండు అక్టుకమిటీవారు విశాఖపట్టణములో 1938 జనవరి 7 వ తేదీలగాయతు 13 వరకున్నూ, రాజమండ్రిలో 16 లగాయతు 22 వరకున్ను విచారణజరిపెదరు. రాజమండ్రి సెంటరులో ఉభయగోదావరి, కృష్ణా గుంటూరు జిల్లాలలోని జమీందారీ, ప్రొప్రయిటరీ, అగ్రహారం మొఖాసాలలోని పరిస్థితులగూర్చి సాక్ష్యము తీసికొందురు. విచారణ ప్రతిదినము ఉదయం గం॥ 8—30 లగాయతు గం॥ 11—30 ల వరకు, మధ్యాహ్నం గం॥ 2-0 లగాయతు 6 గం॥ ల వరకు.

జనవరి 18 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం గం॥ 2 లకు కమిటీవారివద్దకు రైతులు ప్రత్యేక రాయబారము వెళ్లెదరు. ఆరాయబారములో నాలుగు జిల్లాలలోని ప్రతిజమీందారీ గ్రామరైతులు వేనకువేలు పాల్గొన వలయును.

ఒకే ఎస్టేటు గ్రామములు అనేక ప్రాంతములలో నున్నవి. ఒక్కొక్కచోట ఒక్కొక్కరకం యిబ్బందులున్నాయి. ఎస్టేటునకు 2 లేక 3 గురు మాత్రమే సాక్ష్యము యివ్వవలసిఉంటుంది. కాబట్టి అన్నిప్రాంతముల సంగతులు ఆసాక్ష్యమిచ్చువారు తెలిసికొనవలెనంటే ముందు సంప్రదించు కొనవలసిన అవసరమెంతేని గలదు. దానినిగురించి రాజమండ్రి "నేషనల్ గార్డెన్సు" లో జనవరి 12 వ తేదీలగాయతు ఒక క్యాంపు యేర్పాటు చేయబడుతుంది. ప్రతిగ్రామము నుండి రైతుప్రతినిధులు అవసరమగు రికార్డులతో 12 వ తేదీకి ఆక్యాంపుకు తప్పక దయచేయవలయును.

కొరపాటి పట్టాభిరామయ్య,
ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ
సంయుక్త కార్యదర్శి.

తూ॥ గో॥ జిల్లా హారిపుర
కాంగ్రెస్ ప్రతినిధులు.

కంభంపాటి సత్యనారాయణ.
కె. దయానందరాజు.
రావు అచ్చారావు.
తోట రామస్వామి.
చల్లా సుబ్బారాయుడు.
కోరుపు తమ్మయ్య.
మల్లిపూడి పళ్ళంరాజు.
అద్దేపల్లి నాగభూషణం గుప్త.
మార్ని సుబ్బారావు.
కె. ఎల్. నరసింహారావు.
దేవత శ్రీరామమూర్తి.
అరవ వెంకటస్వామి.
నీరుకొండ వెంకటరత్నం.
పుసులూరి కోదండరామయ్య.
చిట్టూరి వెంకటదుర్గాప్రకాశరావు.
పైడిమర్రి సత్యనారాయణ.
బిక్కిన వెంకటరత్నం.
మల్లిడి సత్యనారాయణరెడ్డి.
కళా వెంకట్రావు.
నడింపల్లి బంగార్రాజు.
ఆరుమిల్లి సుబ్బారావు.
తురగా పురుషోత్తం.
పెన్మెత్స సత్యనారాయణరాజు.
మండపాక రంగయ్య.
వేముగంటి పాపాయమ్మ.
కె. బ్రహ్మరాజు

ఇంటి సోదాలు

లక్నోలో సి. ఐ. డి పోలీసు హజ్రాగంజిలో పుస్తకాలషాపును సోదాచేసారు. నిషేధింపబడిన, "ఆరిజిన్ ఆఫ్ రష్యన్ కమ్యూనిజం, విప్లవముయొక్క గమ్యస్థానము" అను పుస్తకాలను జప్తుచేసారు

కాంగ్రెసు మంత్రివర్గాల సిమర్శన బలపరిచడానికే.

పూనాలో ఉపన్యసించుచూ సయ్యద్ జహీరుగారు సోషలిష్టులు కాంగ్రెసు మంత్రివర్గాలపై కక్షతోగాక వారిని బలపరచడానికే విమర్శించుతున్నారనిరి. ప్రజా సామాన్య దురవస్థను స్థిరపరచడానికి తోడ్పడుతుంది గాన ఫెడరేషనును భగ్నంచేయాలని విశదీకరించారు.

ఇండియా మంత్రి: రాష్ట్రీయ రాజ్యాంగాలు.

ఇండియా కార్యదర్శి లార్డు జెట్లండు, నూతన రాజ్యాంగవిధానం ఒడిదుడుకులేకుండా సవ్యంగా సాగుతున్నందుకు ఎంతోసంతోషాన్ని వెల్లడించారు.

"మొన్నటివరకు శత్రువులు మాయుచున్న కాంగ్రెసు వాదులు సివిల్‌సర్వీసు ఉద్యోగులు సామరస్యంగా ఒకరికొకరు నూతన పరిస్థితుల కనుగుణ్యంగా మెలగుతున్నారు. లా అండ్ ఆర్డరు పరిపాలన సక్రమంగా జరుగుతోంది. పోలీసులు ప్రజల మిత్రులనీ ప్రజలు వారికి తోడ్పడాలనీ, కాంగ్రెసు మంత్రులు, రెడ్‌షర్టు నాయకుడు గఫూర్‌ఖాన్ సైతం చెప్పుట, యెంతో సంతోషము. ఒక కాన్పూరులో మాత్రం కొందరు కాంగ్రెసు వాదులు చక్రవర్తిగారి వుద్యోగుల అధికారాలు తమకేవుండాలని పోలీసుప్రతికూల ఉత్సవం జరిపారు. ప్రస్తుతం యిండియాలో రాజద్రోహానికి జైలునందున్నవారు నూరుమంది లోపే" అన్నారు.

లిబరల్ పార్టీ భవిష్యత్తు

లిబరల్‌పార్టీ భావిగతిని గూర్చిన శ్రీనివాసశాస్త్రి గారి ప్రశ్నకు జవాబుగా లార్డులోథియన్ ఇలా చెప్పారు అలహాబాద్ లిబరల్‌పార్టీ వారిచ్చిన విందులో. "విత్తు కొన్ని రోజులు భూమిలో కప్పబడిన తరువాయిగాని మొలచి చెట్టై పుష్పించదు. అటులే నేడు లిబరల్సు ఎన్నికల్లో విజయమొందే సూచన్లేమీ లేవు. ఇంగ్లండులో వారు ప్రభువుసభలో (హౌస్‌ఆవ్ లార్డులో) తలదాచు కొంటున్నారు. ఇండియాలో కౌన్సిల్ ఆవ్ స్టేట్‌వారికి రక్షణ"

రాజద్రోహపు కేసు ఎత్తివేసికొనుట

సంయుక్త రాష్ట్రప్రభుత్వంవారు డెహ్రాడూన్‌లో ఉపన్యసించి నందులకు పండిత్ పరమానందుపై తెచ్చిన రాజద్రోహపుకేసు ఉపసంహరించు కొంటారని తెలుస్తూంది.

ప్రపంచంలోమారణ యంత్రాలకు ఖర్చు

జాతిసమితి ప్రకటించిన లెఖ్ఖల ప్రకారం 1937 సం॥లో ప్రపంచంలో వివిధదేశాలు 240 కోట్ల పౌన్ల ధనం ఆయుధాల క్రింద ఖర్చుచేసాయి. క్రిందటి ప్రపంచ సంగ్రామానికి ముందు 1913లో 86 కోట్లు మాత్రమే ఖర్చుచేసారు.

ఆయుధ విసర్జనసభ ప్రారంభమయిన 1932 సం॥లో 130 కోట్ల పౌన్లుఖర్చుచేసారు.

ఇందతా ప్రపంచయుద్ధానికి సూచనకాదూ?

ఆత్మరక్షణకై చంపుట నేరము కాదు. పంజాబు హైకోర్టు తీర్పు.

పంజాబు హైకోర్టులో ప్రధానన్యాయమూర్తి డగ్లస్ యంగ్, న్యాయమూర్తి అబ్దుల్‌రషీద్‌గార్లు పోలీస్ కానిస్టేబులును చంపిన ముద్దాయి కిర్కీని విడుదలచేస్తూ యిలాచెప్పారు. "పోలీసులచే అక్రమంగా బాధింపబడిన ముద్దాయి బాధనుండి విముక్తుడవటానికి చంపుటకూడా న్యాయమే."

దొంగతనానికి అనుమానంపై అరెస్టుచేయబడిన కిర్కీ అను వానిని పోలీసులు భోగట్టాకొరకు నానా బాధలుపెట్టిరి. కిర్కీ అది సహించలేక కత్తితోతన్ను బాధించిన పోలీసులిద్దరిని పొడచి తానుదొక్కలో పొడుచుకొన్నాడు. ఒకపోలీసు మృతినొందెను. సెషన్సుజడ్జీ విచారించి, కిర్కీకి యావజ్జీ ద్వీపాంతరవాస శిక్షవిధించారు. హైకోర్టువిడుదల చేసింది. ఆత్మరక్షణకై చంపుట నేరంకాదని.

బొంబాయి విద్యార్థి మహాసభ

బొంబాయి విద్యార్థి మహాసభను ప్రారంభించుతూ, సేనాపతి బాపట్‌గారు, జంకులేకుండా పోరాటం సాగించితే విజయంతప్పదనిరి. దేశస్వాతంత్ర్యానికి జరుగు పోరాటంలో విద్యార్థులు పాల్గొనాలి. రష్యన్ ప్లానులు, విధానం, చేకూరిన లాభాలను విద్యార్థులు తెలిసికోవాలన్నారు.

మహాసభకు అధ్యక్షులు సయ్యద్ జహీరుగారు సామ్రాజ్యవాదులక్రింద భారతీయుల కష్టాలను వివరించారు. ప్రపంచస్థితిని, ఫాసిష్టుల దుండగాలను వివరించి దీనికంతకూ కారణం సామ్రాజ్యవాదమేననిరి. ప్రస్తుత విద్యావిధానము బానిసత్వానికి ప్రతిరూపమని నిరూపించారు. సోవియట్ రష్యాలో ప్రజలందరికి సమానావకాశాలుండుటచే, అచటే నిజమైన ప్రజాస్వామిక మున్నదన్నారు.

యుద్ధవ్యతిరేక తీర్మానం, బొంబాయి ప్రభుత్వాన్ని విద్యావిధానంలో మార్పులు గోరుచు తీర్మానం చేయబడినాయి.

గాంధిగారి వార్ధావిద్యావిధానము అభివృద్ధికిదారితీయక, వెనుకటి మధ్యయుగపు ఫ్యూడల్‌స్థితికి నాగరికతను వెనుకకుగెంటు విధానమని మహాసభ అభిప్రాయపడుచూ తీర్మానించింది.

జపాను దౌష్ట్యాన్ని నిరసించుతూ, జపాను వస్తువుల బహిష్కరించగోరుతూ తీర్మానించారు. భాషల ననుసరించి విశ్వవిద్యాలయాలు నిర్మించబడాలనీ, ఆయుధశాసనం రద్దుచేయబడాలనీ, కమ్యూనిస్టుఖైదీల విడుదల చేయాలనీ కోరుచూ తీర్మానించారు.

తూ. గో. జిల్లా రైతు కార్యనిర్వాహక వర్గసమావేశము.

2 జనవరి '38 ఆదివారం ఉదయం గం 8-0 లకు రాజోలు తాలూకా మోరిలో మద్రాసు ఋణనివారణ చట్టము, జమీందారీ విచారణ మొదలగు విషయములు చర్చించుటకు వైసమావేశము జరుగును గాన సభ్యులెల్లరు విచ్చేయ ప్రార్థితులు.

ఇట్లు
పెన్మెత్స సూర్యనారాయణ
ఆర్గనైజింగు సెక్రటరీ.

తూ. గో. జిల్లా యువజన కార్య నిర్వాహక వర్గసమావేశము.

కాకినాడ
26 డిశంబరు

2 జనవరి 38 ఆదివారం మధ్యాహ్నం గం 1 కు రాజోలు తాలూకా మోరిలో వైసమావేశము ఋణనివారణచట్టము, క్రీడలు, ష్రతిభాపరత మొదలగు విషయములు చర్చించుటకు జరుగును గాన సభ్యులెల్లరు విచ్చేయ ప్రార్థన

ఇట్లు
పెన్మెత్స అనంతం
ప్రధాన కార్యదర్శి

తూ. గో. జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సాధారణ సమావేశము

పై సమావేశము కాకినాడలో 26.12.37 మధ్యాహ్నం గం 1-0 కు కామ్రేడ్ కొరపాటి పట్టాభిరామయ్యగారి అధ్యక్షతను జరిగెను. ఈక్రింది తీర్మానములు గావింపబడెను.

1. రాబోవు అఖిల భారత కాంగ్రెసు సోషలిస్టుపార్టీ మహాసభకు జిల్లా పార్టీతరపున 10 మంది ప్రతినిధులు ఎన్నుకొనబడిరి.
2. పార్టీకార్య నిర్వాహక వర్గసభ్యురాలు కామ్రేడ్ కంఠంపాటి మాణిక్యాంబ గారి రాజీనామా అంగీకరింపబడి ఆస్థానే కామ్రేడ్ పెన్మెత్స అనంతంగారెన్నుకొనబడిరి.
3. జిల్లాలో వ్యవసాయ కూలీసంఘము లేర్పరచి వాని అభివృద్ధికై పాటుబడుటకు అయిదుగురు పార్టీ సభ్యులతో కూడిన ఒక ఉపసంఘము నెన్నుకొనబడెను.
4. "భారత కమ్యూనిష్టు పార్టీని నిషేధమునందుంచుట వ్యక్తిస్వాతంత్ర్యమునకు భంగకరము గావున వెంటనే వివిధరాష్ట్రములలోని మంత్రివర్గముల వారు ఆట్టినిషేధమును తొలగించుచు కేంద్ర ప్రభుత్వమువారిని గూడ నిషేధమును తొలగించమని కోరుచు తీర్మానములు చేయవలసినదిగా యీసభవారు కోరుచున్నారు." అని తీర్మానించిరి.

★ ప్రపంచాన్ని తారుమారు చేసే శక్తులూ: ప్రతిశక్తులూ ★

చీనా నంతను కబళించడానికి జపాను రోజురోజుకు ఎక్కువవుతూ ఉన్న భీకరత్వంతో యుద్ధాన్ని సాగిస్తూఉంది. స్పెయినులో ఒకటిన్నర సంవత్సరంగా జర్మనీ ఇటలీలు స్పెయిను ప్రభుత్వముతో యుద్ధము చేస్తున్నాయి. జర్మనీ జపానులు ఒకసంధి ఒడంబడిక పిదప మరియొక ఒడంబడికను ఉల్లంఘించి వేస్తున్నాయి. అమెరికా, బ్రిటిషు ప్రభుత్వముల యుద్ధనావలను వ్యాపారపు టోడలను, జపాను సేనలు కాల్చి, చీనాలోని "యాంగిట్సె కియాంగ్" నదిలోముంచివేశాయి. అమెరికా, బ్రిటనులు, జపానును తీవ్రంగా మందలించాయి. అవసరమయితే యుద్ధము కూడ చేసేటట్లున్నాయని పత్రికలు చదువుకొనేవారను కొనేటట్లు వార్తలు ప్రకటించబడుతూ ఉన్నాయి ఈయుద్ధము ప్రపంచము నంతా ఆవరిస్తుందా యనే ప్రతివానికి సందేహమూ, భయమూ కల్గుతుంది.

అందుచే ప్రతి వారపు వార్తలు పరిశీలించి అర్థము చేసుకోడానికి, ఏమి జరుగనున్నదో చూచాయగనైనా తెలిసికోడానికీ, ప్రపంచ రాజకీయాలను, ఏ శక్తులు, ఏ ప్రతిశక్తులు నడుపుతున్నాయో చర్చిస్తాము.

ఒక దేశపు రాజకీయాలు, ఆ దేశము లోని ఉత్పత్తి విధానము మీద ఆధారపడి వుంటాయి. పూర్వపు ప్రపంచ చరిత్రంతా దీనినే రుజువుచేస్తుంది. నేడు ఈ విషయము మరింత స్పష్టముగా, కనపడుతూ ఉంది. జర్మనీ కాలనీలు తిరిగి ఇవ్వ నున్నప్పుడూ, చైనాలోని తమహక్కులను, తాము పెట్టుబడిపెట్టి వృద్ధిచేసిన గనులనూ, పరిశ్రమలనూ, జపానువారాక్రమించు కొంటూంటే, బ్రిటను అమెరికాలు వ్యతిరేకిస్తూ ఉండడము; ఇటలీ అబిసీనియాను ఆక్రమించడము, చీనాను మ్రింగివేయాలని జపాను పోరాటము సాగించడము, ఇవన్నీ దీనినే రుజువుచేస్తున్నాయి. ఈరోజు, ప్రతిదేశములోని పెట్టుబడిదారులందరూ ట్రస్టులుగా ఏర్పడ్డారు. ప్రతి దేశము లోను, ప్రతి పరిశ్రమ లోను, పోటీలేని గుత్తాధికారాన్ని స్థాపించారు. ఈపరిశ్రమల కన్నింటికి మూల ధనము పెట్టె బ్యాంకరుల ముఠా, పరిశ్రమల నన్నింటినీ అధీనము చేసుకొనినడుపుతున్నారు. ప్రభుత్వాన్ని కూడ ఈ గుత్తాధికారాన్ని కాపాడడానికి పెంపొందింప జేయడానికి బహిరంగంగా ఉపయోగిస్తున్నారు. అందుచేతనే, ఈరోజు ఒకప్రభుత్వము మరియొక ప్రభుత్వముపై కక్ష కట్టినట్టు పత్రికల్లో మనముచూస్తే, దానిఅర్థము ఆదేశములలోని గుత్తాధికారముగల పరిశ్రమ పెట్టుబడిదారులు, మధ్య ఏదోవిషయమై సంఘర్షణ కలిగిందని మన మనుకోవాలి. అందుచే ప్రపంచ రాజకీయాలను భవిష్యత్తు తెలియజేయాలంటే, ప్రస్తుత ప్రపంచపు ఆర్థిక పరిస్థితులేవిధంగా మారుతున్నవో గ్రహించాలి. "నేటి వివిధ దేశములలోని పెట్టుబడిదారీ బ్యాంకర్ల మధ్య, కక్షలు ధ్భవించిన, అవి రాజకీయములందు ప్రతిబింబించడములో అనేక రూపులు పొందుతాయి. ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితులు, దేశ దేశాల మధ్య నున్న ఒడంబడికలు, ఆకక్షలను అణచివేయడానికి, తీవ్రతను తగ్గించడానికి లేక మరియొక రూపు యివ్వడానికి కారణమవుతాయి. నేటిపరకు ఉన్న ఆర్థిక కక్షలు, వివిధ దేశాలలోని గుత్తాధికారములు గల పెట్టుబడిదారీ బ్యాంకరుల యొక్క సంఘర్షణలు, పరస్పర విరుద్ధ స్వలాభాలు, ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయపు టొడంబడికలలో ప్రతిబింబించు తున్నాయి. ఇకముందు అంతర్జాతీయ రాజకీయాల గతి నర్థము చేసుకోవాలంటే, క్రింది విషయాలను కూడా గ్రహించి వుండాలి. అవిఇవి:-

సోవియటు రష్యాలో ఒక నూతన ఉత్పత్తివిధానము, ఒకనూతన సమాజము నిర్మించ బడింది. అచట పనిచేసేవారి ప్రభుత్వముంది. ప్రజలయొక్క అవసరములను తీర్చడానికి వస్తువులను తయారు చేస్తారు. మిగిలిన దేశాలలోని లాభాలు కొరకుచేసే పెట్టుబడిదారుల ఉత్పత్తివిధానము ఇచ్చటలేదు. ఇచ్చట పెట్టుబడిదారులే లేరు. పనిచేసే కూలీల రైతుల యొక్క రోజురోజుకు అభివృద్ధి యగుతూఉన్న సిరిసంపదల చూచి, సౌఖ్యాన్ని సౌకర్యాలనుచూచి ప్రపంచములోని కష్టజీవులు అట్టిప్రభుత్వం తాము నెలకొల్పాలని ప్రయత్నిస్తూ ఉన్నారు. అంటే పెట్టుబడిదారుల పెత్తనాన్ని మిగిలిన ప్రపంచములో లేకుండ జేయాలని ప్రయత్నిస్తూ ఉన్నారు. అందుచే, ప్రపంచాన్ని కదుపుతూఉన్న మొదటి ఘర్షణ (antoganisim)

"సోవియటు యూనియనులోని సోషలిస్టు ఉత్పత్తివిధానానికీ, మిగిలిన ప్రపంచములోని పెట్టుబడిదారీ విధానానికి గల వైరుధ్యం"

కామ్రేడ్ పి. సుందరయ్య.

ఇది ప్రధానమైనది. దీనిననుసరించే దీనివలననే మిగిలిన ఘర్షణలు మారడము, క్రొత్తరూపాలను ధరించడము సాధ్యమవుతుంది. ఉదాహరణంగా చూడండి. హిట్లరు, ముస్సొలోనీలు, అంటే జర్మనీలోని ఇటలీని సామ్రాజ్యవాదులు (సామ్రాజ్యవాదులంటే మొదటవ్రాసిన గుత్తాధికారముగల్గి ప్రభుత్వాన్ని నిర్వహించే పెట్టుబడిదారీ బ్యాంకరులే!) ఆస్ట్రియాకోసం పోరాడుతూ ఉండేవారు. దానివిషయమై ఇంకాతగాదా ఉంది. అయినా, దానిని తాత్కాలికంగా పెనక్కితోసి కలసికోడానికి కారణము, సోవియటు యూనియనుపై వారికున్న కక్షయే.

ఆదేవిధంగా స్పెయినులో ఇటలీ ప్రాబల్యము తనకు నష్టదాయకమైనను, తీవ్రచర్యను ఇగ్లండు (బ్రిటను) తీసుకోక పోవడానికి కారణము, సోవియటు యూనియను ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల కక్షయే. జపానుకు వ్యతిరేకంగా అమెరికా ఇంగ్లండులు, తమహక్కులకు, తమ పరిశ్రమలకు నష్టముకలిగిస్తూ ఉన్ననూ, వెంటనే జపానుపై తీవ్ర చర్యకు పూనుకోక పోవడమునకు కూడ కారణము, ఈసోవియటు యూనియనుపై పెట్టుబడిదారీ ప్రభుత్వాల కక్షయే.

అయితే కొన్ని సమయాలందు, కొన్ని పెట్టుబడిదారీ ప్రభుత్వాలు, సోవియటు యూనియన్‌తో స్నేహముగ ఉంటున్నాయి. దీనికి కారణము, ప్రపంచ రాజకీయాలను తారుమారు చేస్తున్నది-యీక్రింది కారణాలే.

2. వివిధ సామ్రాజ్యవాద ప్రభుత్వాల మధ్యగల కక్షలు.

3. ప్రతి సామ్రాజ్యవాద దేశములో, సామ్రాజ్యవాదులకు, కష్టజీవులకు మధ్య జరుగుతూఉన్న పోరాటము.

4. వివిధ సామ్రాజ్య వాద దేశాల క్రింద బానిసత్వం అనుభవించు చున్న దేశాల ప్రజలు స్వాతంత్ర్యం కొరకు జరుపు పోరాటాలు.

ఒకవైపు, ఒక సామ్రాజ్యవాద ప్రభుత్వము సోవియటు యూనియనుపై తీవ్ర విరోధము చూపుతుంది. మరియొకవైపు మరియొక్క సామ్రాజ్యవాద ప్రభుత్వము సోవియటు యూనియనుతో స్నేహము వాంఛిస్తుంది. ఈరెంటి స్థితుల మధ్య అనేక యితర దేశాలు వూగులాడు తుంటాయి. సోవియట్ రష్యాతో యితర దేశాల సంబంధం, ఈక్రింది ఘటనలను పరిశీలించితే అర్థమవుతుంది.

ఫ్రెంచి పెట్టుబడిదారీ ప్రభుత్వము "లావెల్" ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే హిట్లరు జర్మనీకి వెరచి, సోవియటు యూనియనుతో "పరస్పర సహాయపు టొడంబడిక"ను కుదుర్చుకొన్నది, కాని దానిని పార్లమెంటుచే అంగీకరింపజేయుటకు వెనుకాముందు చూడసాగింది, బ్రిటను సాయంతో జర్మనీతో ఏదో విధంగా రాజీసాధ్యము కాదా; సోవియటు యూనియనుతోటి ఈ ఒడంబడిక లేకుండ జేసుకొనలేమా యని "లావెల్" మార్గాలు వెదుక సాగాడు. ఫ్రాంసులో పాప్యులర్ ఫ్రంటు ప్రభుత్వము సోషలిస్టు బ్లము ప్రధాని క్రింద ఏర్పడిన వెంటనే, ఒడంబడికను పార్లమెంటు అంగీకరించింది.

జెకోస్లోవేకియా రష్యాతో పరస్పర సహాయ్యసంధి చేసికోడానికి కారణం నాజీజర్మనీ భయమే కారణమనివేరుగ చెప్పాలా? కమ్యూనిష్టులను వెంటాడిన, చీనా కమ్యూనిస్టు ప్రభుత్వముతో గత 10 సంవత్సరాలు పోరాటం సాగించిన "చీయంగు కై షేక్" నేడు సోవియటులతో ఒడంబడిక చేసుకోవడము జపాను విజృంభణము దేశములోని ప్రజాసంరంభము అనుట అందరెరిగినదే.

బ్రిటను అమెరికాలు రష్యా సోషలిజం పైగల కక్ష వలన మూకీభావం వహించాయి. అవకాశం చూచి ఇటలీ, జర్మనీలు విజృంభించు తున్నాయి.

అమెరికాఇంగ్లండుకు వున్నవ్యాపార పోటీవలన అవి తన్నెదిరింపజాలవని జపాను గ్రహించియే చీనాపై దాడి సాగిస్తూఉంది.

వివిధ సామ్రాజ్యవాద ప్రభుత్వాల మధ్యనున్న కక్షలలో ముఖ్యమైనవి.

1. అమెరికా-ఇంగ్లండుల మధ్య
2. ఇంగ్లండు-జర్మనీల మధ్య
3. ఇంగ్లండు-ఫ్రాన్సుల మధ్య
4. ఇంగ్లండు-జపానుల మధ్య
5. జపాను-అమెరికాల మధ్య

జర్మనీ, ఫ్రాన్సుల తోటి ఇంగ్లండు సంబంధము తిరిగి:—

ఫ్రాన్సు— జర్మనీల మధ్య
ఫ్రాన్సు— ఇటలీల మధ్య

గల కక్షల ననుసరించి మారుతూ ఉంటుంది. ఈ కక్షలు, ఫ్రాన్సుకు- లిటిల్ ఎంటెంటీ, (జెకోస్లోవేకియా యుగోస్లేవియా, రుమేనియా) మధ్యగల సంబంధమును బట్టి,

(మిగతా 6 వ పేజీలో)

రైతాంగ విద్యాలయం

భారతీ దేవి గారి ప్రబోధం

స్వాగతం

21.12.37 వ తేదీన అధ్యక్షురాలగు శ్రీమతి భారతీ రంగాగారి నాహ్వానించడానికి రైతులు వేలకొలది స్టేషన్‌కువచ్చారు. ఎఱ్ఱజండాలు, జాతీయ జండాలతో స్వాగతమిచ్చారు. యస్. రామిరెడ్డిగారు భారతీరంగా గారిని పుష్పమాలాలంకృతులుగ చేశారు. విద్యాలయమునకు ఉత్సవంతో బయలదేరి వెళ్లారు.

ప్రారంభోత్సవం

సాయంత్రం ప్రారంభోత్సవం జరిగింది. జాతీయ, ఎఱ్ఱజండాలతో అలంకరించిన 12 కాండ్ర ఎద్దులబండి లో భారతీదేవిగారిని, తదితర విద్యాలయ నిర్వాహక వర్గాన్ని ఊరేగించారు. రైతులు, కూలీలు స్త్రీ పురుషులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉపోద్ఘాతం

ప్రిన్సిపాలు సంయల ఓబులరెడ్డిగారు "విద్యాలయం 10 ఏండ్లక్రిందటే ఏర్పడవలసి యుండవలెను. శంకరరెడ్డిగారి మరణంతో లేదని నష్టంకల్గింది. రైతు కూలీల రాజ్యం స్థాపించడమే విద్యాలయం యొక్క పరమావధి. ఒకజాతీయ స్వరాజమేగాక, కూలీరైతుల రాజ్యం స్థాపించాలి. పెంపొందిన కిసాన్ ఉద్యమాన్ని సి. ఐ. డీ. లు వెంటాడడం, రైతునాయకుడు బాట్లీవాలాను అరెస్టు చేయడం, నెహ్రూ ప్రధాని తాను జమీందార్ల మిత్రుడనిచెప్పుకోవడం మనకొక క్లిష్ట దశగావుంది. ఇలాంటి సమయంలో 'రంగా దంపతుల' కృషివల్ల ఆంధ్ర రైతాంగ విద్యాలయంలో తయారయిన మాఫోటి యువజనులు ఉత్సాహంతో ఈవిద్యాలయం ఈనాటికి స్థాపించాం. మీసహాయం అపేక్షిస్తున్నాం" అని పల్కారి.

ప్రారంభోపన్యాస

శ్రీ కె. వి. రామకృష్ణారెడ్డిగారు ప్రారంభోపన్యాసంలో ఇలా చెప్పారు. "రాయలసీమ కీమధ్య ఎక్కడా లేని ప్రచారంవచ్చింది. డాక్టరు పట్టాభి ప్రభృతులు మా సహకారం కావాలంటున్నారు. రాయలసీమ వ్యక్తి .. ంగలిన ఉద్యమం. ఆందోళన త్యాగం చేయకపోవ ది చేత ముదంజ వేయలేదు. ఉత్తరాది వారిని భిక్ష అ..గీ రక్షణలు సంపాదించ జూచే నాయకులను ఏమ..ాలి?

జాతీయ కార్మిక కర్షక ఉద్యమాలను వృద్ధిచేసి త్యాగంచేయ సంసిద్ధంగా ఉండాలి. దానికి యువజనోద్యమం అవసరం. అఖండత్యాగం అవసరం. ఇట్టివిద్యాలయాన్ని మొదట రంగాగారు స్థాపించి అక్కడ తయారైన లచ్చన్న, సదాశివన్, తిమ్మారెడ్డి ప్రభృతులు ప్రజాసేవకులగా- నాయకులగా తయారు జేసి ఆదర్శప్రాయు లయ్యారు. అన్ని సంఘాల వారీ విద్యాలయానికి సహాయం చేయగోరుతాను."

అధ్యక్షోపన్యాసం

శ్రీమతి భారతీ రంగా గారధ్యక్షత వహించుతూ ఇలా ఉపన్యసించారు.

"రైతాంగ ప్రజల కీనాటి విద్యావిధానం మంచిది గాదు. హానికరం కూడా. వుచితప్రైమరీ విద్య ఏర్పడినా, తొమ్మిదేండ్లనుండి తమ పిల్లల్ని కష్టింపజేసే రైతులకు ఏమిలాభమా అని భయంకల్గుతుంది.త్యాగం చేసి తమబిడ్డల్ని పాఠశాలలకి పంపినా, వారికి మన ఆర్థికదాస్యం ఎలాపోతుందో చెప్పరు. అనర్థకమైన దేవతారాధన, ధనికుల్ని, రాజ మహారాజులను పొగిడే పుస్తకాలేగతి. డబ్బుకొరకు పంతుళ్ళు అలాగే ధనికుల్ని పొగుడుతారు. వచ్చీరాని చదువులతో వారి దృష్టి నీచసాహిత్యం పైన పడుతున్నది. సారస్వతాన్ని పాఠశాలల్ని మార్చాలి. ప్రొగ్రెసివ్ (అభివృద్ధికర) వ్రాయసకాండ్రను నేనూ ఆహ్వానిస్తున్నాను.

వయోజనవిద్య కావాలని 1929 ప్రాంతాలనుండి ఆంధ్రదేశాన ప్రారంభమయింది. కాని రాత్రి పాఠశాలలలో అక్షరజ్ఞానం ఇస్తే చాలునన్నభావం ఏర్పడింది. కాని అక్షరజ్ఞానం కంటె విజ్ఞానం అవసరం.

బ్రిటిష్‌వారివల్ల మనదేవుళ్లను మరచిపోయే విద్యను నేర్పుతున్నారన్న గాంధీవాదాన్ని తిరస్కరించుతున్నారు ఈనాడు కార్మికకర్షక నాయకులు. సాంఘికవ్యవస్థల తెలిపే గ్రంధాలు, భావప్రచారకశక్తి, ప్రజా సేవానురక్తి, సోదరత్వభావం, వర్గరక్షణ, కార్మిక కర్షకుల కష్టాలు తొలగించుకొను ప్రయత్నం తెలిపే విద్యా ప్రదానం అవసరం. ఆంధ్రదేశం ఇలాంటి విద్యాలయాలు స్థాపించి అఖిలభారత దేశానికి నాయకత్వం వహించింది. ప్రజాసేవకులగు విద్యార్థులు వేలకు వేలుగా తయారు గావలెనని నా అభీష్టం. వారికివేనా ఆశీస్సులు."

విప్లవం కావాలి !

—రావాలి!!

(5 వ పేజీ తరువాయి)

ప్రతీ అవయవమూ, ఒక స్థితికొచ్చే దాకా, క్రమ క్రమంగా మాతృ గర్భం లోనే పెరుగుతాయి. ఆ తరువాత శిశువు అభివృద్ధి పొందాలంటే పాత జీవితాన్ని వదిలేసి, విప్లవ చైతన్యంతో, కొత్త జీవితంలోకి ప్రవేశించాలి. అట్లా ఒక్క ఉరకతో, మాతృ గర్భం నుంచి ఊడి పడకపోతే యిక అభివృద్ధి పొందటానికి అక్కడ అవకాశమే ఉండదు. యిల్లాగే సమాజ జీవితంలో కూడా. సమాజం ఒక స్థితి కొచ్చేదాకా క్రమ క్రమంగా, వికాసం జెందుతూ వస్తుంది. ఆ తరువాత సమాజం అంతకంటే, ఉచ్ఛస్థితికి పోటానికీ, జీవ వంతంగా ఉండటానికీ, సమాజం లో హఠాత్తుగా, విప్లవ కరమైన మార్పు, ఒక్క ఉరకలో రాక పోతే ఆ సమాజం ఆ స్థితిలోనే అల్లా కుళ్ళి పోతూ, జీవం లేకుండా చచ్చుగా ఉంటుంది. శిశు జన్మకీ, సమాజ విప్లవానికి పోల్చటంలో, యిది వక్క హఠాత్ ప్రళయ సంఘటన మీదే ఆధార పడి ఉందని చెప్పటం మాత్రమే కాదు. ఒక స్థితికి వికాస మొందుతూ వచ్చేక, విప్లవ సంఘటన యొక్క అవసరం ఉందని చెప్పటమే. 'మార్క్సిజం' లో కనపడే సమన్వయాన్నే యిక్కడా ప్రయోగించొచ్చు. మార్క్సు "సమాజం లో ఆర్థిక విధానం క్రమ క్రమంగా ఒక స్థితి కొచ్చేదాకా మార్పు చెందుతూ వస్తుందని, ఆ తరువాత యేదో వక రోజున, హఠాత్తుగా, ఒక్క మారుగా, ఆనాటి రాజకీయ, న్యాయాధికారాన్ని వక వర్గం వశం చేసుకొని, సమాజ ఆర్థిక రాజకీయాల్లో, అద్భుతమైన మార్పు చేసి నూతన సమాజాన్ని నిర్మిస్తుందని" చెప్పాడు.

విప్లవాన్ని ఒక భయంకర పిశాచం లాగ చూసే పిరికి పందలు "సమాజం లోకి ఒక్క సారిగా కొత్త జీవితాన్ని ప్రవేశ పెట్టి అల్ల కల్లోలం చేసే దాని కంటె, మెల్లి మెల్లిగా కొత్త జీవితాన్ని సమాజం లోకి, యెందుకు ప్రవేశ పెట్ట కూడదూ?" అని ముసిలమ్మ ల్లాగ సణుగుతూ అడుగుతారు. యిదెల్లా ఉంటుందంటే "మాతృ గర్భం లో శిశువుకి ఒక్క సారిగా కొత్త చైతన్యం యెందుకు రావాలి? ఒక నెల్లో కాలుకి స్వతంత్ర చలన శక్తి, యింకోనెల్లో కళ్ళకి చూసే శక్తి, మరో నెల్లో ముక్కు గాలిని పీల్చే శక్తి, క్రమ క్రమంగా యెందుకు రాకూడదూ!" అన్నట్టుగా ఉంటుంది. "విప్లవం వద్దు బాబోయి" అనే వాళ్ళ వాదన యింత అసందర్భముగా ఉంటుంది. అంతే కాకుండా శిశువు విప్లవ చైతన్యంతో, బయట పడటం తోటే, అభివృద్ధి, జీవితాశయం పూర్తి కావటం లేదు. మాతృ గర్భం నుంచి ఉట్టి పడటం తోటే, కొత్త జీవం, కొత్త సంబంధాలు, గలిగి, శిశువు పూర్వావయవాలు పెంపొందించు కొంటూ యీ మార్పు ఫలితంగా, కొన్ని కొన్ని ప్రత్యేక శక్తులు అంటే, చేతుల్తో పట్టుకోవడం, మాటలాడ గలగడం నేర్చుతుంది. జన్మ శిశువుకి కొత్త జీవితారంభం— అల్లాగే సమాజానికి విప్లవం కూడాను. విప్లవం వల్ల సమాజం కొత్త జీవనపథం లోకి ప్రవేశిస్తుంది. విప్లవమే సమాజం యొక్క నవజీవితానికీ, నూతనాభివృద్ధికి ఆరంభం. విప్లవం మనం నిత్యం చూచే అనేక సంఘటనల్లో ఉంది. యిది భయపడ వలసినంత పైశాచిక కృత్యం మట్టుకు కాదు. గుడ్డును, బ్రద్దలు గొట్టి కోడిపిల్ల కొత్తజీవంలోకి, అంకురాన్ని పగల్చుకొని మొక్క నూతనజీవంలోకి వస్తున్నాయి. విప్లవం నవ చైతన్యం యొక్క ఆరంభం— విప్లవంలోనే జీవితాభివృద్ధి ఉంది— విప్లవం వద్దని కళ్లు మూసుక్కూచోడం, చచ్చు జీవితాన్ని వాంఛించడం అన్న మాట. సమాజం యొక్క నవ జీవనానికీ, తేజస్సుకీ— విప్లవం కావాలి—రావాలి. వద్దని మొర్రో అని గోలెత్తినా వచ్చి తీరుతుంది. యేం చేస్తాం? మరి— మార్పు అవశ్యం. వద్దని మడి గట్టుకుంటే....

కొవ్వూరు తాలూకా రైతు మహాసభ

—o—

కొవ్వూరుతాలూకా రైతుమహాసభ 17 వ తారీఖున అల్లూరు గ్రామములో కామ్రేడ్ చలసాని వాసుదేవ రావు (ఆం. రాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి) అధ్యక్షత క్రింద సమావేశమై యీదిగువ తీర్మానములు గావించిరి.

1. శివాయిను పేదవారికి పట్టాలు ఇప్పించి వారి జీవనము జరుగులాగున యేర్పాటు చేయవలసినది.

2. వ్యవసాయ కూలీలకు సరియైన కొలతపాత్రలతో కూలి రైతులు ఇవ్వవలసినది.

3. రైతుకష్టాలు పోగొట్టడానికిరైతుసంఘాలుండా అని కాంగ్రెసు వ్యక్తులందరు రైతుసంఘాలు స్థాపించవలసినదని జవ్వాదులాలు నెహ్రూగారు చెప్పిరి. తదనుసారముగా మన రాష్ట్రములోకూడ రైతుసంఘాలు కాంగ్రెసు వ్యక్తులు స్థాపించారు. అట్టి సంఘములు చేయుపనులను జాగ్రత్తగా పరిశీలించ వలసినదిగా, పోలీసులకు హుకుములు వచ్చినయి.పోలీసులు రైతులను బెదరించుటకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెసు ప్రభుత్వము వచ్చినతర్వాత ఇట్టి నిర్బంధ చర్యలు యొక్కువయినందుకు విచారిస్తూ వెంటనే ఆపుదల చేయించవలసినదని.

4. అన్నిగ్రామములలో నీటిపారుదల యావత్తు గ్రామ పంచాయితీల ద్వారా సెక్షన్ ఆఫీసర్‌ను ఒక పంచాయితిగా నిర్ణయించి పైసంఘముల ద్వారా జరుగవలసినదిగా ప్రభుత్వమువారు వుత్తరవు ఇవ్వవలసినది.

5. కంట్రాక్టు పనులన్నియు లేబరు సొసైటీలకు ఇవ్వవలయునను చట్టము చేయవలసినది

6. మద్రాసు గవర్న మెంటువారిని ఆంధ్రరాష్ట్రము విభాగించి ప్రత్యేకముగా ఆంధ్రులకు సౌకర్యములు కలిగించవలసినది.

ఋణనివారణ చట్టమునుగూర్చి

7. మద్రాసు ఋణచట్టములో ఈక్రిందిసవరణలు, ప్రభుత్వము చేయవలయును.

1. వ్యవసాయ కూలీలకందరికి వర్తింపజేయవలెను.

2. ప్రభుత్వపు టప్పులకు శిస్తుబాకీలకు కూడ ఈబిల్లు వర్తింపజేయాలి.

3. కోఆపరేటీవు బ్యాంకులకు కూడ వర్తించాలి.

4. జమీందారులకు 1346 వ ఫసలీవరకు ఇవ్వవలసిన మగతాబాకీలన్ని రద్దుకావాలె. 1937 ఫసలీ మగతాను చెల్లించిన నే,ప్రాతదిరద్దగును అన్నక్లాజుల తొలగించాలి.

5. అసలుకు రెండింతలు డబ్బుకట్టినచో, అసలు మీద నూటికి ఎంతవడ్డీయున్నను సరే అప్పు పూర్తిగా చెల్లించినట్లు లెక్కించవలయును.

6. ఈవిధముగా తగ్గించబడిన అప్పులనన్నిటిని మూడవ వంతైనా త్రోసివేయాలి.

7. ఈవిధముగా తగ్గింప బడిన అప్పులనన్నిటినీ ప్రభుత్వము తానే డిబెంచర్లు ఇచ్చి చెల్లించడానికి పూనుకోవాలి. పిదప రైతులవద్దనుండి 60సాంవత్సరిక వాయిదాలమీద నూటికి రు 3-0-0 లకన్న మించని వడ్డీతో వసూలుచేసుకోవాలి.

8. రైతులకు నూటికి 3-0-0లకు ఎక్కువ వడ్డీ ఉండకూడదు.

9. బిల్లు సెప్టెంబరు నుండి వర్తింపజేయాలి.

10. దావాలు, డిక్రీలు, చరాస్తినికూడ జప్తులు, ఇకముందు చేయకూడదని వెంటనే ప్రభుత్వము ఆర్డినెన్సు ప్రకటించాలి.

8. కొవ్వూరు శెక్షన్ ఆఫీసరుగారు, 4, 5 సంవత్సరములనుండి మామూళ్ళు ఇవ్వ నందున నీళ్ళ సప్లయి చేయక ఇబ్బంది పరచు చున్నారు, దీనినిగూర్చి, కలెక్టరుకు, మంత్రిగారికి అర్జీలు పంపుకొన్నా ఇంతవరకు జబాబులేదు. ఒకకమిటీని నియమించి విచారింపవలెను.

నూతన సంవత్సరానికి అధ్యక్షులుగా బీమవరపు శేషయ్య నాయుడు గారిని, కార్యదర్శిగా వాకాట వెంకట రమణారెడ్డి గారిని, సంఘ కార్యదర్శులు గా యన్. శంకరయ్య, యం. యానాదయ్య గార్లను, 15 మందిని కార్యనిర్వాహక సభ్యులుగాను ఎన్నుకొన్నారు.

★బారువ పేట హుండా మాల్కుదారు పర్యాలు★

రైతులపై క్రిమినల్ నిర్బంధాలు

బారువ-పేట యెస్టేటు జక్కర్ఖండము శాశ్వతి సుత్తునగదు మాలముగా కమ్యూటేషను పద్ధతిపై వసూలు జరుగుచుండెను. ఆ ఖండము రైతుల పంటవానాటికి ప్రతియేట సరియైన నీటిసరఫరా లేనందున క్షీణించుచున్నది. 1343 ఫసలీనుండి కోర్టుద్వారా జమీందారునకు నోటీసులుచేయుట రెవిన్యూ ఇనస్పెక్టరులు తాసిల్దారులు పంటలు తనిఖీచేయుట మున్నగునవి జరుగుచుండెను. సుత్తుపైకమునకు పంటలు సరిపోనందున, సక్రమముగా కమ్యూటేషను జరుగలేనందున, రైతులు సదరు సుత్తుపైకమునకు బాధ్యులముకామనియు, పండేపంటలో సగభాగము యిచ్చుకొనుటకు సంసిద్ధులమనియూ, జమీందారువారు తెచ్చేదావాపై వాదన సాగించిరి, కాని దురదృష్టవశాత్తున రైతుల వకీలు సకాలమున దావాలు అంత్యవేళలో కోర్టుకు హాజరుకాలేక పోయిరి. షుమారు రెండు సంవత్సరములవరకు దావాలు సాగినపిమ్మట, శ్రీకాకుళం సూట్సు డిప్యూటీకలెక్టరుగారు డిక్రీలొసంగిరి, దుర్భరమైన ఆడిక్రీమొత్తములను రైతులు చెల్లించుకొనలేక, జమీందారువారి దయాదాక్షిణ్యములపై ఆధారపడియుండిరి. కాని ప్రభుత్వాధికారము కాంగ్రెసువారి వశమైనదాదిగా అనేక అనవసర అపోహాలకులోనై, జమీందారువారు సదరు డిక్రీ మొత్తములను వసూలు చేయుటకు జప్తులు వారంటులు సాగించుట మొదలిడిరి.గతయేడాది జప్తులువారంటులు సాగించగా, యిద్దరు రైతులు మాత్రము తమకున్న కంచము, ముత్తె యిల్లు వాకిళ్ళు తాకట్టుపెట్టి కొంతమొత్తము చెల్లించుకొనగలిగిరి. కాని మిగతావారు యెంత తంటాలుపడి తాపత్రయ పడినను డబ్బుచిక్కక చెల్లించలేకపోయిరి. ఈమధ్యగత మాసమునుండిజమిందారు వారు పోలీసు సహాయంతో, నిరుపేదరైతులపై జప్తులు సాగించిరి. ఇంటఎవరు లేనప్పటికి తాళాలు పగులగొట్టి, కంచము, చెంబు చేట వగైరా సామానులన్నియు పైకిలాగారు. దుక్కిటెద్దులు ఒకయేరుకూడ జప్తుచేచారు. యేమిచేసినా సరే మేముసిద్ధముగానేయున్నాము, గాని మా వ్యవసాయము సాగకుండా పశువులనుకూడా తోలుకొనిపోయి, మాకుటుంబాలను మాడ్చచూచుట అన్యాయమని ఘోషపెట్టుకొనిరి. కాని లేశమాత్రమైన దయాదాక్షిణ్యములు లేక జప్తు చేసిన సరకులు అక్రమముగా స్వాధీనము చేసికొనిరని పోలీసులచే క్రిమినలుకేసు చేయించి రైతులను నిర్బంధించారు, షుమారు పది ,పదిహేను రోజులైననుయింకను కూనీకేసు నేరస్థులుగనో భావించో మరి యెందువలనో జామీను విడుదలకు కూడా పోలీసులు నిరాకరించిరట. తమబాధ తొలగునని నిండు ఆశలతో భక్తిపూర్వకముగా ఓటులొసగిన రైతులపట్ల, కాంగ్రెసు ప్రభుత్వమువారు, జమీందారులకు సాహుకారులకు అనవసర అవకాశమివ్వక సత్వరముగా రక్షణ కార్యములకు గడంగవలసినదిగా వేడుచున్నాను. స్థానిక ప్రభుత్వోద్యోగులు కూడ నిరుపేదలయెడల దయాదాక్షిణ్యము గలిగి అక్రమజప్తులు, నిర్బంధాలు సాగకుండా శ్రద్ధగైకొనవలసినదని ప్రార్థన,

తెప్పల అప్పలస్వామి,

బారువ-పేట యెస్టేటు

రైతు సంఘ కార్యదర్శి.

ఎంతమంది చచ్చారో

ఎంతధనం వ్యయమయిందో

మీకు తెలుసునా ?

ఫ్రెంచి విప్లవం నెపోలియన్ యుద్ధాలు

వీటిలో ఫ్రెంచి దేశీయులు 20 లక్షల పైగా చచ్చారు. 20 లక్షలదాకా గాయపడ్డారు. కుంటి గ్రుడ్డి అయ్యారు.

ఆస్టర్‌లిట్సునుండి వాటర్లూవరకు; నెపోలియన్‌యుద్ధాలు

ఈయుద్ధాలలో 386000 మంది చనిపోయారు.

పెనిన్సులా యుద్ధం

దీనిలో ఇంగ్లీషువారు 50 వేలమంది, ఫ్రెంచివారు 5 లక్షలమంది చనిపోయారు. ఫ్రాంసు 255,000,000 పౌనులు, ఇంగ్లండు 831,000,000 పౌన్లు ఖర్చు పెట్టింది.

క్రిమియన్ యుద్ధం

దీనిలో ఇంగ్లండు రష్యా, ఫ్రెంచులు 480,000 మందిని పోగొట్టుకొన్నాయి. ఇంగ్లండు 78,000,000 పౌన్లు, రష్యా 142,000,000 పౌన్లు, ఫ్రాంసు 93,000-వేల పౌన్లు ఖర్చుపెట్టినయి.

అమెరికన్ అంతర్యుద్ధం

ఈ అంతఃకలహాలు నాల్గేండ్లున్నాయి. అమెరికనులు 600,000 మంది చనిపోయారు. 121,000,000 పౌన్లు ఖర్చయినాయి.

ఫ్రెంకో—జర్మనీయుద్ధం

ఇది 7 నెలలు సాగింది. 371000 మంది చనిపోయారు.

యుద్ధఖర్చులుగాక నష్టపరిహారంక్రింద 316,000,000 పౌన్లు చెల్లించుకొన్నారు

రష్యా—టర్కీ—యుద్ధం

1877 లో ఒక సంవత్సరందాకా జరిగింది. 200,000 మంది చనిపోయినారు.

రష్యా జపాన్ యుద్ధం

లియోయాంగ్ వద్ద జరిగినయుద్ధంలో రష్యన్‌లు 20,000 మంది చనిపోయారు. జపానీయులు 18,000 మంది చనిపోయారు.

మామ్వద్ద జపానీయులు 16,000 మంది, రష్యనులు 60,000 మంది చనిపోయారు. రష్యాకు 103 , 200 మంది పౌనులు వారానికి ఖర్చయినయి.

ప్రపంచయుద్ధం

మొదటి మూడు నెల్లలోనే 1616000 మంది చనిపోయారు. మొత్తంమీద 8053800 మంది చనిపోయారు. 195567000 మంది గాయపడ్డారు. నష్టపరిహారంగాక 5000,000 పౌనులుగోల్డు జర్మనీ ఖర్చుపెట్టింది. జర్మనీ మిత్రమండలీలు మొత్తం. 56,122,000,000 పౌన్లుఖర్చుపెట్టినాయి.

★ కత్తిరింపులు ★

శ్రీ రాజగోపాలాచారిగారు బెంగుళూరు వెళ్ళినపుడు మైసూరు ప్రభుత్వంవారికి అతిథిగా ఉండవద్దని అచటి కాంగ్రెసు కమిటీవారు ఆచార్లుగారిని కోరిరి. కాని ఆచార్యులవారు అలా వీలులేదన్నారు. ఈమధ్య కాంగ్రెసు వారి విషయంలో మైసూరు ప్రభుత్వము వారు అవలంబించిన నిర్బంధవిధానమును నిరసించుటకుగాను బెంగుళూరు కాంగ్రెసుకమిటీవారు దానిని సూచించిరి. తమరు బెంగుళూరువెళ్ళుట రాజకీయాలతో సంబంధముకానిదనీ బెంగుళూరు కాలేజీ పూర్వ విద్యార్థి అవుటవల్ల వెళుతున్నా మనిరి. "మనపోరాటము అమర్యాద హడావిడి లేకుండా జరుపవచ్చు" నని కూడా అనిరి.

స్వరాజ్యపోరాటము అమర్యాద లేకుండా జరుపవచ్చు నన్నమాటనిజమే. హడావిడి లేకుండా చేయటంకష్టం అని మాత్రం మనవి చేయవలసి వస్తుంది.

ఇక అమర్యాదను గూర్చి విచారించాలి. మైసూరు ప్రభుత్వంవారి ఆతిథ్యాన్ని తిరస్కరిస్తే అమర్యాద చేయటమని వీరి తాత్పర్యం. అయితే వైస్రాయిగారి విందులను కాంగ్రెసువారు బహిష్కరించటం అమర్యాదేనా? బహిష్కరించటంలో బ్రిటిషువిధానంయెడ విముఖత చూపడమనికదా కాంగ్రెసువారు ఇంతకాలం నుంచీ చెప్పేది? వైస్రాయిగారికి వ్యక్తిగతంగా ఎంతమాత్రము అవమానం కలిగించటం లేదని చెప్పటంలేదా? ఆసూత్రమేకదా ఇక్కడకూడా అమలు జరగాలిసింది? తోటి కాంగ్రెసువాదులను నిర్బంధించటం వల్లనే ప్రధానమంత్రిగారిని మైసూరు ప్రభుత్వం వారి ఆతిథ్యాన్ని స్వీకరించవద్దన్నారు. ఈ సందర్భంలో ఆచార్యులవారివాదం కొంతవింతగానే ఉన్నది.

ఒక ప్రభుత్వపు అధికారి మరొక ప్రభుత్వపు అధికారి ఆతిథ్యాన్ని స్వీకరించకపోవటం సమంజసం కాదని వీరన్నారు. ఆచార్యులవారు తమ ఉద్యోగమునకు మితిమీరినవిలువ నిస్తున్నారని అనుకొనవలసి వస్తున్నది. మంత్రులకు తగినంత అధికారము లేదని చెబుతున్నపుడు ఆ ఉద్యోగమువిలువను మరొకస్టేటు ఉద్యోగితో ఉన్న బాంధవ్యములో అంత ప్రాముఖ్యత ఇవ్వకూడదు. అంతేకాకుండా వారికి కాంగ్రెసుతో ఉన్న సంబంధము ఎక్కువకాబట్టి ఆ సంస్థయొక్క ప్రాముఖ్యతచూపటానికి మైసూరువారి ఆతిథ్యాన్ని తిరస్కరించాలిసింది. వారు వ్యక్తిగతంగా లేనిదే ప్రభుత్వంవారి ఆతిథ్యాన్ని అసలు స్వీకరించ నవసరంలేదు.

పడక కుర్చీ భావాలలో ప్రసాద్

(ఆంధ్ర వారపత్రిక)

గ్రంధావలోకనం

PROFESSOR'S PAROXYSM
[పంతులు పరితాపము]

రచయిత మహంకాళి శ్రీరామమూర్తిగారు. తూర్పుగోదావరిజిల్లా కాంగ్రెసు సోషలిష్టుపార్టీ ప్రకటించింది. వెల రెండుఅణాలు.

యువకులగు శ్రీరామమూర్తిగారి ప్రథమ రచనకు మా స్వాగతము. ప్రకటనకర్తలు, రచయిత టీకలో కథాసంగ్రహమును యిచ్చుటచే, మరల మేము కథయిచట వ్రాయాబూనము. చక్కనియింగ్లీషు, గంభీరమైన భావాలు విద్యాధికులైన లాయర్లు, ఉపాధ్యాయులు, కవులు, డాక్టర్లు సమాజంలో తామున్న స్థానాన్ని ఒకసారి వెనుదిరిగి ఆలోచించుకోవలసిన అవసరాన్ని గుర్తించునట్లు చేసే చిన్ని పొత్తము.

రచయిత యిప్పటి విద్యావిధానము నిరర్థక మని, ఓవిధంగా "విద్యార్థులకు విజ్ఞాన మొసంగుటకు బదులు, ఆకలితీర్చలేని డిగ్రీలు, ఒసంగుచున్నదని" చక్కగా చెప్పారు.

'విద్యార్థుల భావస్వాతంత్ర్యం అణకట్టబడు తున్నది. చివాట్లు, జరిమానాలు, మామూలయినాయి. అందుచే వారు తిరుగుబాటుచేసి సంఘాలు నిర్మించు కొంటున్నారు" అని తనతప్పు తెలుసుకొన్న మాష్టరుతో చెప్పించారు.

రచయితను అభినందించుచూ, వారు యింకను యిట్టి రచనలు తెలుగులో వ్రాసే ప్రయత్నాలు గావించి, సామాన్యులందరికి తమభావాలు అందచేస్తారని కోరుచున్నాము.

పుస్తకాలకు—

ఎం. యస్. మూర్తి,
వాళింవారి వీధి, కాకినాడ.

రష్యా విప్లవము.

రష్యా విప్లవనాయకుడు లెనిన్ 1905 విప్లవాన్ని గురించి వ్రాసిన వ్యాసాలూ, ఇచ్చిన ఉపన్యాసాల, సంపుటానికిది అనువాదం.

1905 విప్లవం చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యమైనది. రష్యాలో 1905 విప్లవంతాత్కాలికంగా ఓడిపోయినా అది మరొక నూతన విప్లవానికి దారితీసింది. ఈ విప్లవం నాటికి బోల్షివిక్ పార్టీ పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయి. మెన్షివిక్‌లు, బోల్షివిక్కుల చీలిక, సోషలిస్టు రివల్యూషనరీలు, డెమాక్రాట్ల వైఖరి, జార్ ప్రభువుల నిరంకుశ క్రూరత్వం వల్ల రష్యాచరిత్ర ఎంతో విషమఘట్టాల నెదొర్కన్నది.

ఇట్టి విప్లవాన్ని గురించి లెనిన్, జంకు గొంకులేక, ఖచ్చితంగా, సరియైన మార్క్సిస్టు దృక్పథాన్ని బయటపెట్టి ఎడతెగని పోరాటం సల్పాడు. మార్క్సిస్ట సిద్ధాంతాలను, రష్యా విప్లవంలో ఎత్తుగడలకు సమన్వయించి, శ్రామికవర్గాలకు బోల్షివిక్ నాయకత్వం కల్గించి, లెనిన్ తన కౌశల్యాన్ని బయటపెట్టాడు. ఈ గ్రంథం వలన లెనిన్ రష్యాకేగాదు, ప్రపంచాన్నే ఎదుర్కొనే సమస్యలనే పరిష్కరించు మార్గం చూపెట్టాడు.

ఇలాంటి ఉద్గ్రంథాన్ని తెలుగులోకి అనువదించి జగన్మోహన్ గారు ఆంధ్రపాఠక లోకానికి ఎంతో సహాయం చేశారు.

100 పేజీలు. వెల అరణాలు. అచ్చు బాగానే ఉంది. వలయువారు:—

విశ్వసాహిత్యమాల
ముగండ (*Via*) అంబాజీపేట, తూ.గో. జిల్లాకు
వ్రాయాలి.

[illegible]

అహా[illegible]

[illegible] పద్మా[illegible] ...దావులో. యజమా[illegible] ప్రధానమంత్రి [illegible] కాంధార్ [illegible] నారు 21 వతేదీ [illegible] కలసికొన్నారు.

[illegible]

బొంబాయి [illegible] ర్ కార్మికుల [illegible] పాళ్లి అహ్మద [illegible] కంటె నూటికి 25 [illegible] కార్మికులకు జీతాలు [illegible] లసింది. 1934 లో నూటికి 12 [illegible] నూటికి ముప్పది మంది [illegible] పొందు తున్నారట.

జన్ [illegible] పూర్ [illegible]

ఇండియన్ [illegible] ప్రొపక్టు [illegible] కులు 700 మంది సమ్మెచేస్తున్నారు. సమ్మె [illegible] బోనస్ ఇవ్వకపోవడం. నెహ్రూగారికి, [illegible] కులు విచారింపవలెనని తంతిసంపారు.

[illegible] కార్మిక [illegible]

[illegible] పాడిన, [illegible] సారంలో చేయుచున్నా [illegible] ఉన్న మేస్త్రీ [illegible]

[illegible] నిలువజాలుచున్నాయని. [illegible] ప్రాతినిధ్యం [illegible] చెప్పారు.

[illegible] 18 వ తేదీన [illegible] సమావేశం జరిగింది. [illegible] ఫెడరేషన్ [illegible] ఎల్. ఎల్. [illegible] గారి [illegible]

[illegible] (బ్రిడ్జి) [illegible] తీర్మానించారు. [illegible]

[illegible] ఎస్. ఎల్. [illegible] వైర్మను [illegible] పనిచేయించ [illegible] పనిచేయించి నందులకు. [illegible] పనిచేయించినందులకు. [illegible] చూపించలేక పోయినందులకు [illegible] విధించారు.

[illegible] సి. ఐ. డీల హెచ్చరిక

[illegible] ప్రెసిడెంటు [illegible] గారి ప్రోగ్రాము [illegible] లింగరాజు [illegible] సంవత్సరము క్రిందట [illegible] సత్యన్నారాయణాచార్య [illegible] ప్రతి [illegible] 24 గంటలు [illegible]

[illegible] కాంగ్రెసు ఎన్నికలు

[illegible] ఎన్నికలలో నాల్గుసీట్లకు ముగ్గు [illegible] పోటిలేకుండ ఎన్నుకోబడినారు.

సి. డ. [illegible] డి. పనివారలసంఘం

[illegible] గవర్నమెంటు పిడబ్ల్యుడి. కార్మికు లు, మదరాసు యూనియన్‌కు బ్రాంచి అగు మదరాసు సంఘ అధ్యక్షులు అయిన పి. ఆర్. కె. శర్మ. B. A. (M. L. A.) గారిచే స్థాపించబడెను. 22-12-37 రాత్రి బహిరంగసభ జరుపబడెను. శర్మ గారు అంగ్లములో ఉపన్యసించిరి. సత్యన్నారాయ ణాచార్యగారు తెలుగుకు తర్జుమాచేసిరి.

మదరాసు [illegible] యిటువంటివర్కుషా ప్పులు [illegible] నడుపబడుచున్నవనియు దానిలో యిది

[illegible] అప్పుడు దినముకు 8 గంట [illegible] 10 దినములు [illegible] అప్పుడుపనిచేయు వాళ్లలో [illegible] ప్రతిరేకముగా [illegible] ఎవ్వరైయినా మాట్లాడితే [illegible] జరుగుచున్నవని విను [illegible] కలుగుచున్నవి. అట్టి [illegible] పరిస్థితులు [illegible] శ్రేయస్సుకొరకయి [illegible] అందుచేరి [illegible] సత్యన్నారాయణాచార్య [illegible] మాట్లాడిరి. [illegible] జయజయ ధ్వానాలతో కార్మికులు [illegible]

[illegible] విచిత్ర నవీనామం

[illegible] గోదావరి [illegible] 'బాట్' వేల్లడానికి [illegible] 8 గురుదాకా [illegible] హాస్పిటల్‌లో [illegible] తెలియవచ్చుచున్నది. [illegible] జరుగుతున్నది. వందలకొలది [illegible] శవాలను చూడటానికి [illegible] గొప్పసం [illegible]

[illegible] హార్బరు కార్మికుల ఊరేగింపు

21 వ తేదీ సాయంత్రం 3 గంటలకు హార్బరులో పనిచేయు కార్మికులు, [illegible] బస్తాలు [illegible] దాదాపు 1500 మంది వరుసగా [illegible] జై! [illegible] కార్మికసంఘానికిజై! అని [illegible] నినాదాలు బయలు [illegible] జండాలు ఎగిరినై. [illegible] బయలుదేరింది.

ఇప్పుడు హార్బరులో పనిచేసే 15 వందలమందిలో [illegible] మెడికల్ సెలవులులేవు. [illegible] సెలవులు లేవు. అందరికీ జీతాలుతగ్గిపోయినై. 10 సంవత్సరాలు, 15 సంవత్సరాలు చాకిరిచేసినా [illegible] ఉద్యోగమూ శాశ్వతం (పర్మనెంటు) అని లేదు. [illegible] అన్నిరకాల కష్టాలుఅందరికీ [illegible] మొన్ననే 17 మందికి నోటీసు (పనినుండి తొలగించుటకు) ఇచ్చారు. దానితో కార్మికుల్లో అల జడి బయలుదేరింది. దాని ఫలితమే నేటి ఉత్సవం [illegible] పోవాలి! నిరుద్యోగంపోవాలి! ధని [illegible] పోవాలి. ఎఱ్ఱజండాకుజై. కూలీలసంఘానికిజై. అని నినాదాలువేశారు. పట్టణంలోని వీధులన్నితిరిగి [illegible] సభచేసుకొన్నారు. పని నుండితొలగించిన 17 మందినీ తిరిగి పనిలోచేర్చుకోవాలని తీర్మా నించి. [illegible] తీసుకోకపోతే అందుకు తగిన [illegible] "సమ్మె" కు అందరూ సిద్ధంగా వుండాలంటూ హెచ్చరికలు చేసు కొ ని యిండ్లకు వెళ్లారు.

Printed by V. Suryanarayana Sastry at Srinivasa Press and Edited and Published by M. Annapurniah } Rajahmundry.

END OF VOLUME